

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నల్లగొండ

fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

28-3-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 55 పేజీలు: 8+16 వెల: 6.50


భారత్‌లో పర్యటనకు పుతిన్ అంగీకారం

2వేల వీసా అపాయింట్‌మెంట్లు రద్దు చేసిన అమెరికా

5

# ఈ వివక్షను సాగనివ్వం

## జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లను పెంచొద్దు

## రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో 153, ఏపిలో 225కు సీట్లు పెంచాలి

## మరో పాతికేళ్లు డీలిమిటేషన్ నిలిపివేయండి

## సిఎం రేవంత్ ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం



గురువారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి27,ప్రభాతవార్త:** "జనాభా ప్రాతిపదికన ఆర్థిక ప్రయోజనాలు అనేకం వదులుకున్నాం రాజకీయ ప్రయోజనాలను మాత్రం వదులుకోం" కేంద్రంచేపడుతున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తీర్మానాన్ని ప్రవేశపెడుతూ అన్నారు. నరేంద్రమోడీ సర్కార్ దక్షిణ భారత రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోకపోవడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆచరిస్తూ జనాభా నియంత్రణ చేయడంవల్ల జనాభా తగ్గించిన రాష్ట్రాలు నష్టపోకూడదని అన్నారు. ప్రస్తుతం ఉన్న లోక్ సభ నియోజకవర్గాలనే కొనసాగించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునిర్వభజన చట్టం అనుగుణంగా తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాలను >>2

మాటలను చేతల్లో చూపిన సిఎం రేవంత్: స్టాలిన్ 2



## ఉగాది నుంచి సన్న బియ్యం

### హుజూర్‌నగర్‌లో పంపిణి ఆరంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి27:** సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉగాది పండుగ రోజున సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సన్నబియ్యం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యం పంపిణీకి సన్నాహాలు చేస్తోంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ఏడాదికి 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలి. ఈ స్థాయిలో బియ్యం కావాలంటే 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అవసరం. ఏడాదిలో రెండు సీజన్లలో సేకరించే సన్నధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్నబియ్యం పంపిణీ జరగనుంది.

రూ.1.11 లక్షలకోట్లు అదనపు ఖర్చులు

రూ. 35కోట్ల ఓవర్‌డ్రాఫ్టునూ వాడేసిన సర్కారు

ప్రభుత్వ పద్దులపై 'కాగ్' అక్షింతలు



## రాబడిలో 45 శాతం వేతనాలు, వడ్డీలకే

**హైదరాబాద్, మార్చి 27:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ 2023-24 ఆడిట్‌నివేదికను సభలోప్రవేశపెట్టారు. ఆర్థికమంత్రి డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక పద్దులు, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై నివేదిక ప్రవేశపెట్టారు. ఈ నివేదికలో 2023-24 బడ్జెట్ అంచనా 2,77,690 కోట్లు చేసిన వ్యయం 2,19,307 కోట్లుగా చూపించారు. బడ్జెట్ అంచనాలో 79శాతం వ్యయం చేసినట్లు కాగ్ గుర్తించింది. జిఎస్టీపీలో అంచనా వ్యయం 15శాతంగా గుర్తించారు. ఆమోదం పొందిన బడ్జెట్‌కంటే అదనంగా అంచనాల్లో 33శాతం ఖర్చుచేసినట్లు తేలింది. ప్రభుత్వం అదనంగా 1,11,477 కోట్లు ఖర్చుచేసిందని కాగ్ తన నివేదికలో పొందుపరిచింది. వేస్ అండ్‌మీన్స్ అడ్వాన్స్‌లుద్వారా రూ. 10,156 కోట్లు ప్రభుత్వం తీసుకుంది. అలాగే 145 రోజులపాటు రూ.35,425 కోట్ల ఓవర్‌డ్రాఫ్టును కూడా వాడేసింది. 2023-24లో వడ్డీల చెల్లింపులకోసమే రూ.24,347 కోట్లు ఖర్చుచేసినట్లు కాగ్ తెలిపింది. ఇక సిబ్బంది, ఉద్యోగుల జీతాలకు రూ.26,981 కోట్లు ఖర్చుకాగా ఖజానాకు పన్ను ఆదాయంనుంచి 61.83 శాతం మాత్రమే నిధులు అందుతున్నట్లు తేల్చింది. ఇక 2023-24లో కేంద్రం నుంచి గ్రాంట్లరూపంలో వచ్చిన మొత్తం రూ.9934కోట్లుకాగా రెవెన్యూ రాబడుల్లో 45శాతం వేతనాలు, వడ్డీచెల్లింపులు, పింఛన్లకే ఖర్చుచేస్తున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెపుతున్నాయి. అన్ని రాబడులు, వ్యయాలుపోను రెవెన్యూ మిగులు రూ.779 కోట్లుగా ఉందని కాగ్ వెల్లడించింది. ఇక రెవెన్యూలోటు >>2

# చర్లపల్లి జైలుకు పంపలేదే..



## ఏదీ తులం బంగారం.. రూ. 2,500 ఎవరికిచ్చారు?

### హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

### అప్పులపై మీ లెక్కలన్నీ తప్పులే

### అసెంబ్లీలో కెటిఆర్

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఎందుకు మాట్లాడట్లేదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు నిలదీశారు. కేంద్రంతో సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నా, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై స్పందించడం లేదన్నారు. పీఎం, సీఎం పచ్చి అబద్ధాలు చెప్తున్నారని, కేంద్రంతో సఖ్యత వల్ల రేవంత్‌రెడ్డి >>2



## మాకు కక్ష ఉంటే మీరిక్కడ ఉండేవారా?

## 16 రోజులు నన్ను డిటెన్షన్‌లో ఉంచారు..

### గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు రూ.8,19,151 కోట్లు

## 15 నెలల్లో మేం చేసింది రూ.1,58,041 కోట్లు మాత్రమే: అసెంబ్లీలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి 27,ప్రభాత వార్త:** మేం నిజంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే.. వాళ్లు అక్కడ కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదు. నాకున్న విచక్షణా అధికారాలు ఉపయోగించి చంచలగూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనో మమ్మల్ని పెట్టినచోటే ఉండేవారు అని కేటిఆర్‌ను ఉద్దేశించి సిఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలను చేశారు. గురువారం ఆయన అసెంబ్లిలో మాట్లాడుతూ.. డ్రోన్ ఎగరేస్తే రూ. 500 ఫైన్ వేస్తారు.. కానీ అధికారం అడ్డుపెట్టుకుని ఎంపీగా ఉన్న నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. 16 రోజులు నన్ను డిటెన్షన్ సెల్లో ఒక మనిషి కూడా కనిపించకుండా మమ్మల్ని నిర్బంధించిన ఆ కోపాన్ని బిగపట్టుకున్నాం తప్ప కక్ష సాధింపునకు పాల్పడలేదన్నారు. లైట్లు ఆన్‌లోనే పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా జైల్లో గడిపేలా చేశారన్న సిఎం కరుడు గట్టిన నేరస్తున్ని బంధించినట్లు ఒక పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న నన్ను బంధించారు.వాళ్ల తప్పులను దేవుడుచూస్తాడు..అంతకు అంతఅనుభవిస్తారు అనుకుని ఊరుకున్నా నా మీద కక్ష చూపినవారిని దేవుడేఆసుపత్రిపాలు చేశాడన్నారు. చర్లపల్లి జైలు నుంచి నా బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి ఎన్ కన్వెన్షన్‌కు వెళ్ళకుండా అడ్డుకున్నారు. డిల్లీ నుంచి గొప్ప గొప్ప లాయర్లను పెట్టి తాను బయటకు రాకుండా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు.రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అయినా నేను కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదన్న సిఎం నిజంగానే నేను కక్ష సాధించాలనుకుంటే మీ కుటుంబమంతా చర్లపల్లి జైల్లో ఉండేవారన్నారు.కానీ తాను ఆ పని నేను చేయలేదు. మేం విజ్ఞత ప్రదర్శించాం..ప్రజలు అధికారం ఇచ్చింది నా కక్ష తీర్చుకోవడానికి కాదని నేను విజ్ఞత ప్రదర్శించా అన్నారు. సొంతపార్టీ ఆఫీసులో బూతులు తీయించి రికార్డు చేయించినా.. చెంపలు వాయించే శక్తి ఉన్నా నేను సంయమనం పాటించా ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం ఇదంతా గమనిస్తోందని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్ రైతులకు రుణమాఫీ చేయలేదని పేర్కొన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పిన కెసీఆర్.నాలుగేళ్లల్లో చేసిన మాఫీ >>2

# దేవాదుల ట్రయల్‌రన్ సక్సెస్

## దేవన్నపేట పంప్‌హౌజ్ నుంచి ధర్మసాగర్‌కు గోదావరి జలాలు

### 60 వేల ఎకరాలకు సాగునీరు: మంత్రి ఉత్తమ్



గురువారం దేవాదుల ట్రయల్‌రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ:** తెలంగాణరాష్ట్రాన్ని సస్యశ్యామల చేయడమే ప్రభుత్వ లక్ష్యమని,ఈ రబీ సీజన్‌లోనే రైతులకు సాగునీరు అందించాలనే ఉదేశ్యంతో ఎన్ని అడ్డంకులు ఎదురైనా దేవాదుల 3వదశ పనులు పూర్తి చేసి రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు మోటార్లను ప్రారంభిస్తున్నట్లు ఆయా శాఖలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు తెలిపారు.దేవన్నపేట శివారులోని జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-3, ప్యాకేజ్ 3వ భాగంగా నూతనంగా నిర్మించిన దేవన్నపేట పంప్ హౌస్ మోటార్లను గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పంప్‌హౌస్‌లోని మోటార్లను రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పరిశీలించారు. దేవాదుల పంప్ హౌస్‌కు సంబంధించిన ఫేజ్-1, 2, 3లకు సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, అధికారులతో సమీక్షించారు. అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించి నీటి విడుదలను పరిశీలించి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఫేజ్ 1,2,3లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర >>2



## భారీగా పెరగనున్న 'కేంద్ర' జీతాలు, పెన్షన్లు

### త్వరలో 8వ వేతన కమిషన్ సిఫారసులు అమలు

**న్యూఢిల్లీ, మార్చి 27:** ఎనిమిదవ వేతన సవరణ సంఘం సిఫారసులు అమలుచేస్తే ప్రస్తుతంమధ్య స్థాయి ఉద్యోగులు పొందుతున్న నెలసరి వేతనం లక్షరూపాయలనుంచి 1.15 లక్షల రూపాయల వరకూ పొందుతారని ట్యాక్స్ నిపుణులు పేర్కొంటున్నారు. కేవలం ఉద్యోగుల జీతభత్యాలకే కేంద్ర బడ్జెట్‌లో 1.75 లక్షలకోట్లు కేటాయించిందని దీనివల్ల ఉద్యోగుల జీతభత్యాలు మరింతగా పెరుగుతాయని అంచనా. రెండులక్షలకోట్లు కేటాయింపులు జరిపితే జీతాలు 1,16,700చొప్పున పెరుగుతాయి. అదే బడ్జెట్‌లో జీతభత్యాలకు 2.25 లక్షలకోట్లు కేటాయింపులు జరిపితే మిడ్‌లెవల్ జీతాలు 1,18,800కు చేరతాయని ట్యాక్స్ నిపుణులు పేర్కొంటున్నారు. ఎనిమిదవ వేతన కమిషన్ 2025 ఏప్రిల్‌నాటికి ఏర్పాటుచేస్తే 2026 లేదా 2027లో వేతనసంఘం సిఫారసులు వస్తాయి. పదేళ్లకోసారి జీతభత్యాల సవరణలకోసం వేతన సంఘాలను నియమిస్తున్నారు ఏడో వేతన సంఘం 2016లో సిఫారసులు అమలుచేసారు. దీనివల్ల ప్రభుత్వంపై 1.02లక్షలకోట్లుభారం పడింది.సవరించిన జీతాలు, పింఛన్లను 2016 జులై నుంచి అమలులోకివచ్చాయి.ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 2.57రెట్లుగా అంచనావేసారు.దీనితో మూలవేతనం ఏడువేలనుంచి 18వేలకు పెరిగింది.అదే 8వ వేతనసంఘం సిఫారసులు అమలుకువస్తే 3 లేదా అంతకుమించి ఉంటుంది.ఉద్యోగసంఘాలు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 2.57 లేదా అంతకుమించిగాని లేదా ఏడోవేతన సంఘానికి అనుగుణంగా మాత్రమే ఉంటుందని అంచనావేస్తున్నాయి.

# ఆ 400 ఎకరాలు వేలం వేయొద్దు

## అది జీవవైవిధ్యానికి సంబంధించిన భూమి



### గత విధానానికి కట్టుబడి ఉండాలి.. సిఎం రేవంత్‌కు లేఖలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** ఆర్థిక వనరుల సమీకరణ పేరిట తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయదలచిన రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కంచ గచ్చిబౌలి గ్రామంలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసారు.

ఆర్థిక వనరుల సమీకరణ పేరిట రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25(పి)లో ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ భూమిని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ ద్వారా వేలం వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందన్నారు.

గతంలో మీరు పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భవిష్యత్తు తరాలను, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా మాట్లాడారు. మనం బ్రతకడానికి, మన సోకులకు ప్రభుత్వ భూములు అమ్మొద్దు, ఒకవేళ ప్రభుత్వ భూములను అమ్మితే భవిష్యత్తులో ప్రజల అవసరం కోసం ఏదైనా నిర్మించాలన్నా, ప్రభుత్వ ఆసుపత్రులు కానీ, విద్యాలయాలు కానీ, చివరకు చచ్చిపోతే స్మశానాలకు కూడా భూమి లేని పరిస్థితి ఉంటుందని, గతంలో మీరన్న మాటలను ఈ సందర్భంగా ఒకసారి గుర్తు చేస్తున్నాను.

ప్రస్తుతం మీరు వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమికి ఆనుకుని జీవవైవిధ్యానికి నెలవైన అనేక వృక్షజాలం, జంతుజాలం, సరస్సులు ఉన్నాయి. ఇందులో 734 వృక్ష జాతులు, 220 పక్షి జాతులతో సహా నెమళ్లు, వలస పక్షులు, మచ్చల జింకలు, నాలుగు కొమ్ముల జింకలు, అడవి పందులు, కొండ చిలువలు, భారతీయ నక్షత్ర తాబేళ్లు వంటి వైవిధ్యభరితమైన జీవజాతులు, మష్రూమ్ రాక్‌తో సహా సహజసిద్ధంగా ఏర్పడి ఎంతో ఆకర్షణీయంగా ఉండే రాళ్ళ అమరికలెన్నో ఉన్నాయని అనేకమంది ప్రముఖులు తెలియజేస్తున్నారు. 'మీరు వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమి అటవీశాఖ పరిధిలోకి రానప్పటికీ చుట్టూ పచ్చని చెట్లతో, వైవిధ్యమైన జీవజాతులతో కూడిన ఈ భూమి నగరానికి ఊపిరులూదే ఒక ఆక్సిజన్ వనరుగా ఉందన్నారు.

అలాంటి ఈ భూమిని కాంక్రీట్ నిర్మాణాలతో నింపేస్తే, భూమిలో నీటివనరులు తగ్గిపోయి, ఆయా జీవజాతులకు నష్టం జరిగి, పర్యావరణానికి, నగరానికి పెద్దఎత్తున ముప్పు చేకూరే అవకాశం ఉందన్నారు. పర్యావరణానికి మీరు చేయబోయే ఈ నష్టం తిరిగి పూడ్చలేనిది. ముఖ్యంగా ఈ భూమి పరిధిలో ఉన్న భారతీయ నక్షత్ర తాబేళ్ళకు, వాటి ఆవాసాలకు ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరం. వన్యప్రాణుల సంరక్షణ చట్టం, 1972 లోని షెడ్యూల్ 4 కింద భారతీయ నక్షత్ర తాబేళ్ళు సంరక్షించవలసిన జీవజాతుల కిందకు వస్తాయి. ఈ చట్టంకింద ఆయా జీవజాతుల సంరక్షణతోపాటు, వాటి ఆవాసాలను కూడా సంరక్షించాలని అన్నారు.

# మున్సిపల్ శాఖలో రిటైర్డ్ ఉద్యోగులకు ఉద్వాసన

## 177 మంది ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** మున్సిపల్‌శాఖలో రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్వాసన పలికింది. పదవి విరమణచేసి విధులు నిర్వహిస్తున్న 177 మంది ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత కొద్ది రోజులక్రితం రిటైర్డ్ ఆఫీసర్లకు మరోసారి ఎక్స్‌టెన్షన్ ఇవ్వకూడదని సిఎం రేవంత్ నిర్ణయించినట్టు తెలిసింది.అంతేకాకుండా పురపాలకశాఖ సైతం ముఖ్యమంత్రి వద్ద ఉండడంతో, పురపాలకశాఖ నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు ఉద్వాసన పలికే ప్రక్రియను ప్రారంభించారు. మార్చి 31 తర్వాత రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఇంటిదారి పట్టనున్నారు. సిఎం రేవంత్ ఆదేశాల మేరకు సిఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న రిటైర్ట్ అధికారులపై ఆరా తీసింది. వివిధ శాఖల్లో మొత్తం 1,048 మంది అధికారులు ఉన్నట్టు గుర్తించారు. పలువురు కాంట్రాక్టు అధికారుల కాలం ఇప్పటికే ముగిసింది. సిఎం రేవంత్ రెడ్డి దగ్గర ఉన్నమున్సిపల్ శాఖలోనే ఎక్కువ మంది రిటైర్డ్ అధికారులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నట్టు తెలిసింది. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ >>2



గురువారం లోక్‌సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## మాటలను చేతల్లో చూపిన సిఎం రేవంత్: స్టాలిన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి27:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విధాన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తెలంగాణ శాసనసభలో ఒక ముఖ్యమైన మైలు రాయిలా నిలిచిపోయే తీర్మానం చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటలను చేతల్లో నిరూపించారని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ శాసనసభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ సరైన రీతిలో పునర్విభజన కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారని తమిళనాడు సీఎం పేర్కొన్నారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయని, ఇది ఆరంభం మాత్రమేనని.. హైదరాబాద్‌లో ఐక్యకార్యాచరణ సమితి రెండో సమావేశం నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు అదే బాటలో నడుస్తాయని తమిళనాడు సీఎం అభిప్రాయపడ్డారు. పునర్విభజన విషయంలో తమిళనాడును అనుసరిస్తూ, ఈ చర్య మన ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## దేవాదుల ట్రయల్‌రన్ సక్సెస్

>> నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అన్నారు. పంపు హౌస్ లోని ఒక్క పంపును ఆన్ చేయడం ద్వారా సుమారు 600నుండి 650క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని తెలిపారు. దింతో స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, జనగామ, కొంత భాగం వర్ధన్నపేట నియోజకవర్గాలలోని పంటలకు సాగునీరు అందించవచ్చున్నారు. దేవాదుల ప్రాజెక్టు గత పదేళ్లుగా ఎందుకు పూర్తి కాలేదనే విషయం మనఅందరికీ తెలుసునని అన్నారు. రానున్న రోజులలో రాష్ట్రాన్ని సమస్యశ్యామలం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు ఉద్వాసన

>> కమిషనరేట్, జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, కుడా, హెచ్‌ఎమ్మార్‌ఎల్, వైటిడిఎ తదితర శాఖలలో 177 మంది రిటైర్డ్ ఆఫీసర్లు ఉన్నారు. వీరందరిని తొలగిస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యియి. వీటిలో 2002లో పదవి విరమణ చేసిన అధికారులు సైతం విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు 20 సంవత్సరాలకు పైబడిన అధికారులకు చాలా మంది ఉన్నారు. గురువారం 177 మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతూ ఉత్తర్వులు జారీ అయ్యియి.

## అవయవదానంతో అక్రమ వ్యాపారం చేస్తే అరదండాలు

### మానవ అవయవాల మార్పిడి బిల్లు ఆమోదం

**హైదరాబాద్,మార్చి 27,ప్రభాతవార్త:** అవయవదానంతో అక్రమ వ్యాపారం చేస్తే తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని పదేళ్ళు కఠిన కారాగారంతోపాటు కోటి రూపాయల జరిమాన విధిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. గురువారం తెలంగాణ శాసనసభలో కేంద్ర విధానానికి అనుగునంగానే అవయవ దానం చేసే విధంగా బిల్లును దామోదరరాజనర్సింహ ప్రవేశపెట్టగా ఏకగ్రీవంతో సభ్యులు ఆమోదించారు. అవయవ మార్పిడి అక్రమాల రాకెట్‌ను అరికట్టడానికి ఈ బిల్లు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. గ్రాండ్‌పేరంట్ గ్రాండ్ చిల్డ్రన్‌కు అవయదానం చేసే అవకాశం ఉందని తెలిపారు. స్వాప్ ద్వారా పరస్పర అవయదానం చేసేందుకు అవకాశం కలగడమే కాకుండా అవయవాల మార్పిడిచేసే దందాలను కఠినంగా చర్యలు తీసుకొనే వీలు ఏర్పడుతోందని చెప్పారు. బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ సూపర్‌స్పెషాల్టీ నుంచి బ్రాడ్‌స్పెషాల్టీకి తీసుకొస్తున్నామని తెలిపారు. అవయవాలు మార్పిడి చేసుకొనే రోగులకు స్థానికంగానే కాకుండా ప్రాంతీయంగా, జాతీయంగా వాటిని పొందడానికి అవకాశం లభిస్తుందని అన్నారు. స్థానికంగా హైదరాబాద్, ప్రాంతీయంగా చెన్నై, జాతీయంగా ఢిల్లీ కేంద్రాలు ఉంటాయని సూటో, రోటో, నాటో రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం రోగులకు ఉంటుందని చెప్పారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ 2023 వరకు ఉస్మానియా గాంధీ ఆసుపత్రిలో 609 అవయవాలు మార్పిడి జరిగిందని ఆరోగ్యశ్రీ పథకం కింద ముఖ్యమంత్రి కెసిఆర్ 577 మంది పేదలకు చికిత్స చేయించారని దీనికోసం ఒక్కో రోగికి రూ.20లక్షలకు పైగా వ్యయం చేయబడిందని తెలిపారు. రాష్ట్రంలో 2014లో 233 మందిక అవయవదానంతో ప్రాణదానం చేశారని అన్నారు. 2015లో 364, 2016లో 563, 2017లో 573, 2018లో 469, 2019లో 257 2020లో 616, 2021లో 716, 2022లో 729, 2023లో 725 అవయవ మార్పిడిలు తెలంగాణలో జరిగాయని కేంద్రం నుంచి నాలుగుసార్లు అవార్డులు వచ్చాయని ఇది మన డాక్టర్ల గొప్పతనం అని అన్నారు.

## సొంతగడ్డపై ఖంగుతిన్న ఆరెంజ్ ఆర్మీ

### 5 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్‌పై లక్నోసూపర్‌జెయింట్స్ విక్టరీ

**హైదరాబాద్, మార్చి 27:** ఐపిఎల్ 2025 సీజన్‌లో ఏడో మ్యాచ్‌గాజరిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నోసూపర్‌జైయింట్స్ మధ్యజరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. చివరివరకూ ఉత్కంఠగా సాగిన ఈమ్యాచ్‌లో చివరకు ఎల్‌ఎస్జీ జట్టు ఐదు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లనష్టానికి 190 పరుగులుచేసింది. ఈ లక్ష్యాన్ని లక్నో జట్టు 16.1 ఓవర్లలోనే ఛేదించింది. నికోలస్ పూరన్ 26 బంతుల్లో ఆరుఫోర్లు, ఆరుసిక్స్‌లుచేసి 70 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. ఈమ్యాచ్‌లో మిచేల్‌మార్ష్, నికొలస్ పూరన్‌ల భాగస్వామ్యంలోనే 116 పరుగులు వచ్చాయి. ఐపిఎల్‌లో ఎల్‌ఎస్జీ రెండో రికార్డును సాధించింది. అంతకుముందు సాధించిన కెఎల్‌రాహుల్ దీపక్‌హూడాల 95 పరుగుల రికార్డును ఎల్‌ఎస్జీయే అధిగమించింది. టాపార్డర్ వైఫల్యంతో భారీ స్కోరు సాధించలేకపోయిన పాట్‌కమిన్స్ ఆరెంజ్ ఆర్మీ లక్నో బ్యాటర్లను కట్టడిచేయడంలో కూడా విఫలం అయింది. 190 పరుగుల ఛేదనలో నికొలస్ పూరన్ 70, ఓపెనర్ మిచెల్‌మార్ష్‌లు 52 పరుగులతో విధ్వంస అర్ధసెంచరీలతో ఆడారు. బౌండరీలతో ఉప్పల్‌స్టేడియాన్నిహోరెత్తించిన ఇద్దరూ లక్నోను గెలుపుదిశగా నడిపారు. అబ్దుల్‌సమద్ 22 పరుగులుచేసినా నాటౌట్‌గా నిలిచాడు. డేవిడ్‌మిల్లర్ 13 నాటౌట్‌లు దూకుడుగా ఆడి లాంఛనం ముగించారు. ఐదు వికెట్ల తేడాతో జయభేరి మోగించిన లక్నో 18వ సీజన్‌లో అదిరే బోణీ కొట్టింది. కాగా హైదరాబాద్ జట్టులో విధ్వంసంచేసే బ్యాటర్లు చేతులెత్తేసారు. ట్రావిస్ హెడ్ 47, అనికిత్‌వర్మ 36లపోరాటంతో 190 పరుగులుచేసింది. ఛేదనలో తన తొలి ఓవర్‌లోనే మహ్మద్‌షమీ డేంజరస్ బౌలింగ్‌తో ఎయిడెన్ మార్క్‌రమ్‌ను ఒకే ఒక్క పరుగుతో వెనక్కిపంపించాడు. మిడాఫ్‌దిశగా మార్క్‌రమ్ ఆడిన బంతిని అక్కడే కాచుకుని ఉన్న కమిన్స్ ఒడిసిపట్టుకున్నాడు. దాంతో నాలుగు పరుగుల వద్ద లక్నో మొదటి వికెట్‌పడినా మార్ష్, పూరన్‌లు నిలబెట్టారు.

## రంజాన్‌కు 2 రోజుల సెలవు

### సర్కార్ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పండుగలు, వాటి సెలవులకు సంబంధించి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. ఈ నెల 31న ముస్లిమ్‌ల పండుగ రంజాన్‌కి సెలవు ప్రకటించిన ప్రభుత్వం మరుసటి రోజైన ఏప్రిల్ 1 కూడా సెలవుగా ప్రకటించింది. ముస్లింలకు పవిత్ర పండగ అయినా రంజాన్ నేపథ్యంలో సర్కార్ రెండు రోజులు సెలవులు ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వ పని దినాల ప్రకారం మార్చ్ 31న ఈదుల్ ఫితర్(రంజాన్) తోపాటు.. మరుసటి రోజైన ఏప్రిల్ 1న కూడా సెలవు దినంగా ప్రకటించింది. నేడు(మార్చి28న) జమాతుల్‌విదా, షబ్‌ఏ ఖాదర్ సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఇచ్చిన విషయం తెలిసిందే. నేడు మైనారిటీ విద్యా సంస్థలకు సెలవు ఉండనుండగా.. మిగతా సంస్థలు యధావిధిగా కొనసాగనున్నాయి. గత బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పటి నుంచి బోనాల పండగతోపాటు మరుసటి రోజు, క్రిస్మస్‌తోపాటు మరుసటి రోజు, రంజాన్‌తో పాటు మరుసటి రోజు కూడా సెలవు ప్రకటిస్తూ వచ్చింది. అదే విధానాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ విధానాన్నే కొనసాగిస్తూ రంజాన్ మరుసటి రోజు(ఏప్రిల్ 1) సెలవు దినంగా ప్రకటించింది.

## లంబాడాల మాతృభాష 'గోర్‌బోలి'ని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి27:** బంజారాలు, లంబాడాల మాతృభాష 'గోర్‌బోలి'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం ఆమోదింపజేసినందుకు పలువురు ఎమ్మెల్యేలు సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం గిరిజన ఎమ్మెల్యేలు బాలూ నాయక్, రాంచంద్రునాయక్, రాందాస్ నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సిఎంని అసెంబ్లీ ఛాంబర్‌లో కలిసి అభినంద నలు తెలిపారు. లంబాడా, బంజా రాల చిర కాల ఆకాంక్ష ఆయన 'గోర్‌బోలి' భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించిన విషయం తెలిసిందే.

## వారం - వర్జ్యం

తేది : 28-03-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
చతుర్దశి రా.7.56
పూర్వాభాద్ర రా.10.09
వర్జ్యం ఉ.6.19-7.45
దు.ఉ.8.41-9.30,
2) మ.12.45-1.34
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి కొంతవరకు అనుకూలం.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలలో విస్తరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. వాహనసౌఖ్యం.

**మిథునం:** రుణవత్తిడులు తొలగుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**కర్కాటకం :** అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనలాభాలు పొందుతారు.

**సింహం:** దీర్ఘకాలిక సమస్యలు ఎదురైన నిదానంగా పరిష్కరించుకుంటారు. ఖర్చులు పెరుగుతాయి.

**కన్య :** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**తుల :** బంధువులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. సంతానం నూతన విద్యావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. కొత్త పరిచయాలు పెరుగుతాయి. క్రయవిక్రయాలు.

**మకరం:** చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. రుణబాధల నుండి విముక్తి పొందుతారు.

**కుంభం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తు వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మీనం :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఈ వివక్షను సాగనివ్వం

>> 153కు ఆంధ్రప్రదేశ్ సీట్లు 225 పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలని తెలిపారు. "స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ప్రాంతీయ అసమానతలు తగ్గించాలనే ఉద్దేశ్యంతో 1971లో రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్‌ను 25 ఏళ్లు నిలిపివేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై గందరగోళం నెలకొంది. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను 2001లో ఆనాటి ప్రధాని వాజపేయి కూడా వ్యతిరేకించారు." అని రేవంత్‌రెడ్డి గతంను అసెంబ్లీలో నెమరేసుకున్నారు. వాజ్ పేయూ హయాంలో సీట్లు పెంచకుండా డీలిమిటేషన్ చేశారని తెలిపారు. ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా ఉత్తరాధిలో నియోజకవర్గాలను పెంచుకోవడానికి చేపట్టిన పునర్విభజనను వ్యతిరేస్తూ సమావేశం ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించబోమని తీర్మానం చేశారని సభకు తెలిపారు. లోక్ సభలో దక్షిణాది ఎంపిల సంఖ్య 130 రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కొందరు మన ద్రవిడ ప్రాంతానికి చెందిన ఎంపిలు అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. జనాభా నియంత్రణపై కేంద్రం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయని గుర్తు చేశారు. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించలేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉందని, పునర్విభజనే జరిగితే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 19 శాతానికి పడిపోతుందని ఆందోళన చెందారు. డిలిమిటేషన్ అనేది దక్షిణాది రాష్ట్రాలను లిమిట్‌లో పెట్టడానికే, దీనిపై రాజకీయవైరుద్యాలు ఎన్నిక ఉన్నా అందరూ ఒకే మాటపై ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం పెట్టే తీర్మానానికి పార్టీలకు అతీతంగా బిఆర్‌ఎస్, బిజెపి, సిపిఐ, ఎంఐఎం మద్దతు ఇవ్వాలని కోరారు. తెలుగురాష్ట్రాలలో శాసనసభ నియోజకవర్గాలను పెంచాలని పునర్విభజన చట్టంలో ఉందన్నారు. రాజకీయ ప్రయోజనం కలిగించే జమ్ముకశ్మీర్‌లో, సిక్కింలో డిలిమిటేషన్ చేశారని రేవంత్ ఆరోపించారు. 2011 జనాభా ప్రకారమే సిక్కి, జమ్ముకశ్మీర్ నియోజకవర్గాలను పెంచారని రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సీట్లు పెంచలేదని ద్వంద్వవిధానాలతో బిజెపి వ్యవహరింస్తున్నదని అన్నారు. 2026జనాభా జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాలు పెంచుతామని కేంద్రం చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. డీలిమిటేషన్‌పై ఆనాడు వాజపేయి చేసిన తీర్మానానికి బీజేపీ కట్టుబడి ఉందా?అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయి. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు చాలా తక్కువ వస్తున్నాయి.
యూపీ, బిహార్, మధ్యప్రదేశ్‌కు కేంద్రం పన్నుల్లో ఎక్కువ వాటాను ఇస్తోంది. తమిళనాడు రూపాయి చెల్లిస్తే కేవలం 26 పైసలు పొందుతోంది. కర్ణాటక రూపాయికి 16 పైసలు, తెలంగాణ 42 పైసలు, కేరళ 49 పైసలు పొందుతోంది. బిహార్ మాత్రం రూపాయికి ఆరు రూపాయల 6 పైసలు పొందుతోంది. యూపీ రూపాయికి రూ.2.03, మధ్యప్రదేశ్ రూ.1.73 పొందుతోందని గణాంకాలను సభలో రేవంత్‌రెడ్డి వల్లించారు.
ఆర్థిక ప్రయోజనాలను వదులుకున్నా రాజకీయ ప్రయోజనాలను వదులుకోబోమని దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనం కోసం పోరాట నిర్మాణం చేస్తామని ఆయన తెలిపారు. కేంద్రప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి మన ఓటుపై ప్రణాళిక బద్దంగా దాడిమొదలైందని దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించడానికి దాడి జరుగుతోందని మనం అంతా మేలుకోవాని అన్నారు. లోక్‌సభ సీట్లు పెంచొద్దని, రాష్ట్రాల్లో అంతర్గత డీలిమిటేషన్ చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 1976లో లోక్‌సభ సీట్లు పెంచకుండానే డీలిమిటేషన్ చేపట్టారని వివరించారు.
నియోజకవర్గాల పునర్విభజపన రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానత్వం తీసుకువస్తుందన్నారు. . ప్రధాని మోదీ కూడా లోక్‌సభ సీట్లు పెంచకూడదని కోరారు. జనాభా ఆధారంగా చేపట్టే పునర్విభజన ను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవని సీఎం స్పష్టంగా చెప్పారు. దక్షిణాది రాజకీయ వాణి కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆర్థిక శాఖలో జరిగిన విధ్వంసం మొత్తం తవ్వితీస్తా: డి.సి.ఎం.భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి27:** 'నేను యాదృచ్ఛికంగా పొలిటికల్ లీడర్ను కాలేదు.. చాలా ఆలోచించి రాజకీయాల్లోకి వచ్చా. ఒక ఫ్యూడల్ వ్యవస్థలో, భావ దారిద్రం, అణిచివేతలో కూరుకుపోయిన వారిని బయటపడేయాలని రాజకీయాల్లోకి వచ్చా' అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో అప్రాప్రియేషన్ బిల్లుపై ప్రసంగించారు. సమ సమాజం స్థాపనతోనే అభివృద్ధి, అది జరగాలంటే చట్టసభల ద్వారానే సాధ్యమని రాజకీయాల్లోకి వచ్చా అనిచెప్పారు. ప్రజల జీవన విధానం బాగుపడాలని అంతా ఆత్మగౌరంతో జీవించడం కోసం రాజకీయాల్లోకి వచ్చా.. మీలాగా వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాల్లోకి రాలేదు అని బిఆర్‌ఎస్ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వచ్చిన అవకాశాన్ని సమ సమాజ స్థాపన కోసం వినియోగిస్తాను.'బయట చాలా మాట్లాడుతారు అని వాటిని సభలో ప్రస్తావిస్తున్నారు. మేం మాట్లాడడం మొదలుపెడితే మీ కన్నా ఎక్కువ మాట్లాడగలం. గంజాయి రాజు, లిక్కర్ రాణి అని బయట చాలా మాట్లాడుతున్నారు.. అవి సభలో మేము మాట్లాడం సభ్యత కాదు' అని పేర్కొన్నారు. ఆర్థిక శాఖలో జరిగిన ఆర్థిక విధ్వంసం మొత్తం తవ్వితీస్తా..ఉన్న విషయాలు సభలో రాష్ట్ర ప్రజల ముందు పెట్టి వివరిస్తా అని చెప్పారు. సంక్షేమమే మాకు ప్రాధాన్యత రంగం, రాబడి ఖర్చు ఏయే శాఖలకు ఎంత కేటాయింపులు అర్థవంతంగా అవసరాలకు తగిన విధంగా బడ్జెట్ రూపొందించామని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మీ 10 సంవత్సరాల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, స్త్రీ శిశు సంక్షేమం కోసం రూ.70,474 కోట్లు కేటాయించి ఖర్చు చేయలేదని ఆరోపించారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద 50 వేల కోట్లు ఖర్చు పెడతామని గత ప్రభుత్వం చెప్పి చేయలేదన్నారు. మేం అధికారంలోకి రాగానే ఆర్థిక, సామాజిక, రాజకీయ సర్వే జరిపించాం.. రాష్ట్రంలో 86శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమానికి మీరు నిధులు ఖర్చు చేయలేదని నిర్ధారణ జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే సంక్షేమం కోసం మొట్టమొదటిసారి రికార్డు స్థాయిలో కేటాయింపులు చేశామన్నారు. మూడు లక్షల 4 వేల కోట్ల బడ్జెట్లో 1,44,156 కోట్లు సంక్షేమం కోసం కేటాయించామని,మేం రాబడి నీ దృష్టిలో పెట్టుకొని ఆ మేరకే ఈ బడ్జెట్లో కేటాయింపులు చేశామన్నారు. రూ.40 వేల కోట్ల బిల్స్ మీరు పెండింగ్లో పెట్టి పోయారని తెలిపారు..ఉద్యోగుల బకాయిలు కాకుండానే రూ.40 వేల కోట్లు పెండింగ్లో పెట్టారు. 1,59,940 లక్షల కోట్ల పనులు శాంక్షన్ చేసి పోయారు. ఆ పనుల బిల్లులు పెండింగ్లో పెట్టి పోయారని ఆరోపించారు. ఉద్యోగులు రిటైర్ అయితే భారం మీపై పడుతుందని మూడు సంవత్సరాలు పెంచారు. మొత్తం ఉద్యోగుల బకాయిలు రూ.20వేల కోట్లు ఉండగా అందులో మేం రూ.16 వేల కోట్లు క్లియర్ చేశాం. పాలనలో భాగస్వాములు ఉద్యోగులు.. వారిని పిలిచి బకాయిలకు సంబంధించి వివరాలు వెల్లడించి రాబోయే రోజుల్లో వాటిని ఎలా క్లియర్ చేస్తామో ఉద్యోగులకు వివరించగా వారు సంతృప్తి చెందారని తెలిపారు. మీరు లక్ష కోట్లు అప్పు తెచ్చి లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు.. మీరు తెచ్చిన అప్పులకు పదేళ్ల తర్వాత చెల్లింపులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఆ లక్ష కోట్లు అప్పులు మాపై వదిలివేశారు.. పెండింగ్ బిల్స్ రీపేమెంట్ భారం మా ప్రభుత్వం పైపడిందన్నారు. మీలాగా 20శాతం అంచనాలు పెంచకుండా వాస్తవిక బడ్జెటును ప్రవేశపెట్టామని తెలిపారు. లక్ష మంది అధికారులతో నభూతో న భవిష్యత్తు అన్నట్టు కుల సర్వే చేశాం.. ప్లానింగ్ శాఖను నేనే చూస్తున్నాను. ఈ రాష్ట్ర వనరులు వెనుకబడిన పేద వర్గాలకు ఎలా పంచాలి అనే విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్యాబినెట్‌కు కమిట్మెంట్ ఉందన్నారు.




న్యూఢిల్లీలో గురువారం 12వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## చర్లపల్లి జైలుకు పంపలేదే..

>> రూ.16,143 కోట్లు వడ్డీ పోగా వీళ్ల మొదటి ఐదేళ్లల్లో చేసిన రుణమాఫీ 13,514 కోట్లు మాత్రమే రెండోసారి అధికారంలోకి వచ్చాక నాలుగేళ్ల రైతుల రుణమాఫీకి రూపాయి కూడా ఇవ్వలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. చివరి ఏడాదిలో 21,35,557 మంది రైతులకు రూ.11,909 కోట్లు మాత్రమే మాఫీ చేశారు పదేళ్లలో బిఆర్‌ఎస్ చేసిన రుణమాఫీ రూ.16,908 కోట్లు మాత్రమే వీళ్ల మమ్మల్ని రుణమాఫీ చేయలేదని మాట్లాడుతున్నారు విమర్శించారు. పది నెలల్లో మేం 25,35,964 మంది రైతులకు రూ. 20,616,89 కోట్లు మాఫీ చేశామన్న సిఎం పదేళ్లలో మీరు చేసింది ఎంది ఏమిటి ?పది నెలల్లో మేం చేసింది ఎంటో చూడాలన్నారు. ప్రజలు ఉరి తీసినా మీ ఆలోచనా విధానంలో మార్పు రాలేదన్న సిఎం బిఆర్‌ఎస్ వాళ్లు ఎగ్గొట్టిన రైతు బందు రూ.7,625 కోట్లు చెల్లించడమే కాకుండా రూ.4666.59 కోట్లు రెండో విడత రైతు భరోసా అందించామన్నారు. రైతు భరోసాను రూ. 10 వేల నుంచి రూ. 12 వేలకు పెంచాం వరి వేస్తే ఉరి అని చెప్పిన వాళ్ల ఫామ్ హౌస్ లో పండిన వడ్లను క్వింటాల్ రూ.4500 చొప్పున కావేరి సీడ్స్ కు అమ్ముకున్నారని సిఎం రేవంత్ ఆరోపించారు. కానీ మేం రూ.11 వేల 61 కోట్లు సన్న వడ్లకు బోనస్ ఇచ్చాం.ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ 29,14,692 మంది రైతులకు రూ.15,332 కోట్లు వెచ్చించి రైతు బీమాను కొనసాగించామన్నారు. మీరు పదేళ్ల చేయలేనివి మేం పదినెలల్లో చేస్తే అభినందించాల్సింది పోయి కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారంటూ మండి పడ్డారు. నన్ను అభినందించకపోయినా ఫరవాలేదు కానీ ప్రభుత్వాన్ని అభినందించవచ్చు కదా అన్నారు.16 మంది ముఖ్యమంత్రులు చేసిన అప్పు 2014 నాటికి మొత్తం అప్పు రూ.90,160 కోట్లు కాగా పదేళ్లలో బిఆర్‌ఎస్ చేసిన అప్పు 1.12.2023 నాటికి రూ.6,69,257 కోట్లు, ఇది కాకుండా 40 వేల 154 కోట్లు పేమెంట్స్ పెండింగ్‌లో పెట్టారన్న సిఎం ఇవి కలిపితే వాళ్ల పదేళ్లలో చేసిన మొత్తం అప్పు రూ. 8,19,151 కోట్లు, ఇక వాళ్ల సాధించిన ఘనత ఏమిటో వాళ్లే చెప్పాలని నిలదీశారు. పదేళ్లలో ఒక పార్టీ,ఒక కుటుంబం చేసిన అప్పు ఏడున్నర లక్షల కోట్లు కాగా మేం వచ్చిన పదిహేను నెలల్లో చేసిన రూ.1,58,041 కోట్లుఇందులో డిసెంబర్ 2023 నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు చెల్లించిన అసలు మొత్తం రూ. 88,591 కోట్లు అని వివరించారు. డిసెంబర్ 2023 నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు చెల్లించిన వడ్డీ మొత్తం రూ. 64,768 కోట్లు పదేళ్లలో వాళ్లు చేసిన అప్పులకు అసలు, వడ్డీ కలిపి మేం తిరిగి చెల్లించిన మొత్తం రూ. 1,53,359 కోట్లు వాళ్లు చేసిన అప్పులకు చెల్లించినవి పోగా.. 15 నెలల్లో మా ప్రభుత్వం చేసిన నికర అప్పు రూ.4,682 కోట్లు మాత్రమే అని అన్నారు.

## రాబడిలో 45 శాతం వేతనాలు, వడ్డీలకే

>> అయితే రూ.49,977 కోట్లుగా ఉంది. జిఎస్టిపిలో రెవెన్యూలోటు 3.33శాతం అంటే ఎఫ్ఆర్‌బిఎం మార్గదర్శకాలమేరకు మాత్రమే ఉన్నట్లు తేల్చింది. 2023-24 ఆర్థికసంవత్సరం ముగిసేనాటికి రుణాలు తెలంగాణ ప్రభుత్వం 4,03,664క ఓట్లు తీసుకుంది. జీఎస్డీపీలో అప్పులు 27శాతంగా ఉన్నాయి. 2023-24 వరకూ ప్రభుత్వం మొత్తం 2,20,607 కోట్లరూపాయలమేర రుణాలపై గ్యారంటీలు ఇచ్చింది. ఇక మూలధన వ్యయం కింద 2023-24లో 43,918 కోట్లు వ్యయంచేసింది. స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.76,773కోట్లు పంపిణీచేసిందని కాగ్ వెల్లడించింది.

## ద్రవ్య వినిమయబిల్లుకు అసెంబ్లీ ఆమోదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి27:** అసెంబ్లీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై సాధారణ చర్చ పూర్తి కావడంతో పాటు పద్దులు ఆమోదం పొందాయి. 11 రోజులపాటు సమావేశాలు సాగిన అసెంబ్లీలో చివరి రోజైన గురువారం రాత్రి ద్రవ్య వినిమయ బిల్లుపై ఉభయ సభల్లో చర్చించి ఆమోదించారు.

## ఏదీ తులం బంగారం..

>> ఏం సాధించారని నిలదీశారు. బడ్జెట్‌పై అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి పనిలో గత ప్రభుత్వమని బిఆర్‌ఎస్‌ను విమర్శిస్తున్నవారు కేంద్రంపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారని ప్రశ్నించారు. కొట్లాడకపోతే కేంద్రం నిధులు కూడా ఇవ్వదని, పోరాడాల్సిందేనని చెప్పారు. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు తాము కూడా మద్దతిస్తామని అన్నారు. తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు కేంద్రం ఒక్క రూపాయైనా ఇచ్చిందా అని అడిగాకె. సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని, కుంభమేళాకు కేంద్రం నిధులు ఇస్తుందని అలాగే సమ్మక సారలమ్మ జాతరకు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వరని పేర్కొన్నారు. మనం అడగకపోతే కేంద్రం నిధులు ఇవ్వదని చెప్పారు. తెలంగాణ 1 ట్రిలియల్ ఎకానిమీ కావాలంటే ప్రస్తుత ధరల ప్రకారం 35 ఏళ్లు పడుతుందని, పీఎం రెండు కోట్ల ఉద్యోగాలు, సీఎం 2 లక్షల ఉద్యోగాలు ఇస్తమన్నారని గుర్తు చేశారు. ఇక అప్పులపై ఎందుకు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆర్థిక వ్యవస్థ గురించి ఎవరికీ పెద్ద అవగాహన లేదని, 10 ఏళ్ల తర్వాత సకల సౌకర్యాలతో రాష్ట్రాన్ని మీకు అప్పజెప్పామని అన్నారు. తెలంగాణకు మేలు జరగాలని, ప్రజలు బాగుండాలని, అధికారంలో ఏ పార్టీ ఉన్నా రాష్ట్రం బాగుండాలన్నదే తమ పార్టీ సంకల్పమని తెలిపారు. పదవులు శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని తెలిపారు. తెలంగాణ పథకాలను కేంద్రం అనుకరిస్తోందని, తమకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం మాట్లాడకపోవడం బాధేసిందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదని విమర్శించారని గుర్తు చేశారు. తమకు వచ్చిందే సున్నానే మరి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు వచ్చింది గుండు సున్నా కాదా అని నిలదీశారు. పసుపు బోర్డు ప్రకటించి ఆ బోర్డుకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. తెలంగాణపై ఉన్నది సవతితల్లి ప్రేమ మాత్రమే అని అభ్యంతరం వ్యక్తం చేశారు. అద్దెలు చెల్లించకపోవడంతో గురుకుల భవనాలకు తాళాలు వేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే తాము కూడా చెల్లించామని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఇచ్చింది 11 వేల ఉద్యోగాలు మాత్రమేనని స్పష్టం చేశారు. అది కూడా తాము పరీక్షలు నిర్వహించిన వాటికే వీళ్ల నియామకపత్రాలు ఇచ్చారని అభ్యంతరం వ్యక్తం చేశారు. వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తామన్నారని, ఇప్పటికీ చేయలేదని, కోటి మంది మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామన్నారని, ఇవ్వలేదని గుర్తు చేశారు.
కల్యాణలక్ష్మీ కింద తులం బంగారం కోసం ఎదురుచూస్తున్నారని, దళితబంధు, గిరిజనబంధు కింద రూ.12 లక్షల చొప్పున ఇస్తామన్నారని ఇవ్వాలన్నారు. రెండు ఢిల్లీ పార్టీలకు తెలంగాణపై ఉన్నది సవతితల్లి ప్రేమ మాత్రమేనని తెలిపారు. కాగా ఎవరేమన్నా తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని, తెలంగాణ బూతుపిత రేవంత్‌రెడ్డి అని అభివర్ణించారు. స్వల్ప కాలంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలబడిందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన మొట్ట మొదటి దశాబ్ద కాలంలోనే మెరుపు వేగంతో తెలంగాణ దూసుకెళ్లిందని తెలిపారు. స్వల్ప సమయంలో ఇంత ప్రగతి సాధించడం మనందరికి గర్వకారణమని వెల్లడించారు. గత పదేళ్లలో అభివృద్ధి పథంలో మెరుపు వేగాన్ని ఆవిష్కరించి తెలంగాణను అగ్రగామిగా కేసీఆర్ నిలబెట్టారని వ్యాఖ్యానించారు. పరిపాలనలో కొత్త ఒరవడిని, ప్రణాళికల రూపకల్పనలో సరికొత్త పంథాను అనుసరించామని, 2014 నుంచి 2022 వరకు వృద్ధి రేటు తీసుకుంటే 17.57 శాతంతో అగ్రగామిగా తెలంగాణ నిలబడిందని వివరించారు.

# వైద్యుడి ప్రాణం తీసిన 'బట్టతల'

### పెళ్లికి బట్టతల అడ్డురావడంతో

### రైలు కిందపడి వైద్యుడి ఆత్మహత్య

### కేవలరీ బ్యారెక్స్ రైల్వేస్టేషన్ వద్ద ఘటన

**హైదరాబాద్ (అల్వాల్), మార్చి 27, ప్రభాతవార్త:** బట్టతల వైద్యుడి పాలిట ప్రాణ సంకటంగా మారింది. ఎన్ని సంబంధాలు చూసినా అతని బట్ట తలను చూసి పెళ్లికూతుర్లు మోహం చాటేయడం ప్రారంభించారు.



పురోహిత్ కిషోర్(ఫైల్)

ఎంబిబిఎస్ చదివినా వివాహం అవవడం లేదనే మనస్తాపం అతనిలో బలంగా నాటుకు పోయింది. బస్తీ దవఖానాలో పని చేస్తున్న వైద్యుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొల్లారం కేవలరీ బ్యారెక్స్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు వైద్య సిబ్బంది తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ ఇందిరానగర్ బస్తీ దవఖానాలో గుజరాత్‌కు చెందిన పురోహిత్ కిషోర్(34) గత సంవత్సరం కాలంగా వైద్యుడిగా పని చేస్తున్నాడు. పురోహిత్‌కు బట్టతల ఉండడంతో సంవత్సరాలు కాలంగా పెళ్ళి కుదరడం లేదు. ఉన్నతమైన చదువు ఉన్నా బట్టతల నెపంతో వివాహం వాయిదా పడుతూ వస్తున్న వైనం అతనిలో జీవితంపై విరక్తిని కలిగించింది. ఇటీవల ఓ సంబంధం కుదిరి నిశ్చితార్థం కూడా జరిగింది. బట్టతల ఉన్న వ్యక్తిని వివాహం చేసుకోనని పెళ్ళి కూతురు పెద్దలు వద్ద బాంబు పేల్చింది. ఎంత సర్ది చెప్పినా ఆమె వినక పోవడంతో నిశ్చితార్థం రద్దయ్యింది. అనంతరం కుటుంబ పెద్దలు వివాహం చేయడానికి పలు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బాధితుడు బయటకి వెళ్ళాడు. బొల్లారం రైల్వే స్టేషన్ వద్ద తన వాహనాన్ని నిలపడం జరిగింది. అనంతరం అక్కడి నుంచి నడుచుకుంటూ సమీపంలోని కేవలరీ బ్యారెక్స్ రైల్వే స్టేషన్ వెళ్ళాడు. అదే సమయంలో నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న హుజూరాబాద్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి పురోహిత్ ఆత్మహత్య చేసుకున్నారు. యువకుడు రైలు కింద పడిన విషయాన్ని గమనించిన లోకో పైలట్ రైలును ఆపి రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డులు ఆధారంతో పురోహిత్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హైకోర్టు మెట్లెక్కిన టెన్త్ డిబార్ విద్యార్థిని

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** నల్లగొండ జిల్లా నకిరేకల్ లో పదో తరగతి పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారం ఎట్టకేలకు తెలంగాణ హైకోర్టు కు చేరింది. ఇప్పటికే ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మొత్తం 11 మందిపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా పేపర్ లీకేజీకి సహకరించిందంటూ విద్యార్థిని ఝాన్సీలక్ష్మిని అధికారులు డీబార్ చేశారు. అయితే, మొత్తం వ్యవహారంలో తన తప్పేమీ లేదని, పరీక్షకు అనుమతించాలని ఝాన్సీలక్ష్మి అధికారులను వేడుకుంది. ఎవరో ఆకతాయిలు వచ్చి కిటికీ దగ్గర ఎగ్జామ్ రాస్తున్న తనను బెదిరించి ప్రశ్నాపత్రాన్ని ఫోటో తీసుకుని వెళ్లారని వాపోయింది. ఫోటోలు తీసిన వ్యక్తులు ఎవరో కూడా తనకు తెలియదని బాధితురాలు మీడియా ముందు కన్నీళ్లు పెట్టింది. ఈ క్రమంలోనే విద్యార్థిని ఝాన్సీలక్ష్మి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. తనపై డీబార్‌ను ఎత్తివేసి..వెంటనే పరీక్ష రాసేందుకు అనుమతించాలని పిటిషన్ దాఖాలు చేసింది. అదేవిధంగా విద్యాశాఖ సెక్రటరీ, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సెక్రటరీ, నల్గొండ డీఈవో, ఎంఈవో, నకిరేకల్ ఎగ్జామ్ సెంటర్ సూపరింటెండెంట్‌లను పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చింది. ఈ మేరకు ఝాన్సీలక్ష్మి పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు.. ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసింది.

## ఏప్రిల్ 25 నుంచి పిహెచ్‌డి ప్రవేశ పరీక్షలు

### ఒయు అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయం పిహెచ్‌డి- 2025 ప్రవేశ పరీక్షలను ఏప్రిల్ 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. పరీక్షలను మూడు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఉస్మానియా యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి గురువారం విడుదల చేశారు. మొత్తం 49 సబ్జెక్టులలో పిహెచ్‌డి అడ్మిషన్ల కోసం ఏప్రిల్ 25 నుండి 27 వరకు రోజుకు మూడు సెషన్‌లలో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను అభ్యర్థులు యూనివర్సిటీ అధికారిక వెబ్ సైట్‌లో ఏప్రిల్ 20 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో సిబిటి (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) విధానంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరు కోవాలని.. పరీక్ష ప్రారంభానికి 90 నిమిషాల ముందు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఏప్రిల్ 25 నుంచి 27 వరకు మూడు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించనున్నారు. సెషన్-1 ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, సెషన్-2 మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు, సెషన్-3 మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగించనున్నారు.

# సభలో ఫొటోలు తీసిన హరీశ్‌రావుపై ఆగ్రహం

### రూల్స్‌కు విరుద్ధం : స్పీకర్‌కు ఆది శ్రీనివాస్ ఫిర్యాదు


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 27:** అసెంబ్లీలో కాళేశ్వరంపై చర్చ సందర్భంగా బిజెపికి చెందిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బుధవారం రాత్రి గత బిఆర్ఎస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వ రం నిర్మాణంలో అడ్డగోలుగా వ్యవహరించిన ఆ ప్రభుత్వానికి ఆదిలాబాద్, సిర్పూర్ ప్రజల ఉసురు తగిలిందని అన్నారు. ఆయన ప్రసంగం పూర్తవగానే పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వచ్చి హరీశ్‌బాబును అభినందించారు. పలు వురు ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. ఈ సమయంలో సభలోనే ఉన్న మాజీమంత్రి హరీశ్‌రావు వారి ఫొటోలను తన సెల్‌ఫోన్‌లో బంధించారు. ఇదే సమయంలో సభలో స్పీకర్.. హరీశ్‌రావును ఉద్దేశించి మీరు మంత్రిగా పనిచేశారు. ఫొటోలు తీయడం కరెక్ట్ కాదన్నారు. దీనిపై గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు స్పీకర్‌పై గౌరవం లేదని ఆరోపించారు. సిఎం రేవంత్ అంటే ఈర్ష్య, డిప్యూటీ సిఎంపై నిందారోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే అబ ద్ధాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకత్వం అసెంబ్లీ సంప్రదాయాలను పక్కన బెట్టి ఫోటోలు, వీడియోలు తీసిందని తెలిపారు. సభ జరుగుతున్న సమయంలో స్పీకర్ అనుమతి లేకుండా ఏ కార్యక్రమాలు చేయవద్దని అసెంబ్లీ వ్యవహారాల మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు తెలియ దా? అని ప్రశ్నించారు. లాబీల్లో నినాదాలు చేయడం, ఎంట్రీ పాయింట్ వద్ద ధర్నా చేయడాన్ని కూడా ఆది శ్రీనివాస్ తప్పుబట్టారు. హరీశ్‌రావుతోపాటు ఇతర సభ్యులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మండలి చైర్మన్ ఆగ్రహం

### ఇలా వ్యవహరిస్తే చర్య తప్పదని హెచ్చరిక

### శాసనమండలిలో కొనసాగిన ప్రత్యేక ప్రస్తావనలు, పిటిషన్లు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్ర 2025-26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ సమా వేశాల సందర్భంగా గురువారం శాసన మండలి సమావేశాలు ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగానే స్పెషల్ మెన్షన్స్‌ను చేపడుతున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. దీంతో చాలా మంది సభ్యులు తమ స్పెషల్ మెన్షన్స్‌ను ప్రస్తావించారు. సభ్యులు జీవన్ రెడ్డి, బస్వరాజు సారయ్య, కోటిరెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, వాణిదేవి, సత్యవతి రాథోడ్, తీన్మార్ మల్లన్న తమ స్పెషల్ మెన్షన్స్‌ను ప్రస్తావించారు. వాటిలో కొందరు తాము స్పెషల్ మెన్షన్స్‌ను చేస్తున్నప్పటికీ వాటికి మంత్రుల నుంచి స్పందన ఉండటం లేదని.. గతంలో కూడా తాము ఇచ్చిన స్పెషల్ మెన్షన్స్‌కి సంబంధించి ఇప్పటి వరకు స్పందన రాలేదని.. కాబట్టి మంత్రుల నుంచి స్పందన వచ్చేలా చూడాలని కొందరు సభ్యులు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రులు వాటిపై స్పందించేలా చూడాలని ఛైర్మన్ సూచించారు. అనంతరం పిటిషన్లను సభకు సమర్పించాలని ఛైర్మన్ సభ్యులకు సూచించారు. ఈ సమయంలో బిజెపి సభ్యుడు ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ బుధవారం సభలో తన విద్యా సంస్థలపై ఒక సభ్యుడు మాట్లాడుతూ నర్సరికే



రూ.41వేల ఫీజును తీసుకుంటూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని.. ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఫీజుల నిర్ధారణ కోసం ఎఫ్ఆర్‌సీని ఏర్పాటు చేయాలని భావిస్తోందని.. ఇంకా కమిటీని ఏర్పాటు చేయలేదని ఏవిఎన్ రెడ్డి అన్నారు. ఆ కమిటీ ఫీజులను ప్రతిపాదిస్తే.. వాటి కంటే తాము ఎక్కువగా తీసుకుంటే.. అప్పుడు అడ్డగోలుగా ఫీజులను తీసుకున్నట్టు అవుతుందని.. కానీ కమిటీ ఇంకా ఏర్పాటు కాలేదని.. ఫీజులపై నిర్ణయం వెలువడలేదని.. అటువంటి సమయంలో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎలా అంటారని ప్రశ్నించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య రంగంపై చర్చ సందర్భంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తుందని చెప్పారని.. అలా చూసిన తాము వసూలు చేస్తున్న ఫీజు రూ. 41వేలు ఎక్కువ కాదని పేర్కొన్నారు. ఈ సమయంలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కల్పించుకొని తాము నిన్నటి(బుధవారం) రోజే ఆ వ్యాఖ్యలను తొలగించినట్టు తెలిపారు. ఈ సమయంలో తీన్మార్ మల్లన్న కలగజేసుకొని తన వ్యాఖ్యలను అలాగే కొనసాగించాలని కోరారు. దీంతో ఇతర సభ్యులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ అంటే ఆయన(తీన్మార్ మల్లన్న)కు గౌరవం లేదని.. మీరు(ఛైర్మన్) ఆయన వ్యాఖ్యలను తొలగించాలని పేర్కొన్నామంటే.. తానుమాత్రం కొనసాగించాలని అంటున్నాడని ఫిర్యాదు చేశారు. దీంతో తీన్మార్ మల్లన్న, ఇతర సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఛైర్మన్ కలగజేసుకొని తీన్మార్ మల్లన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ఇష్టానుసారం వ్యవహరించడం కుదరదని మరోసారి ఇలా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చర్యలు తీసుకోవాలనుకుంటే తీసుకోమని తీన్మార్ మల్లన్న చెప్పారు. దీంతో సభలో ఈ అంశంపై వాగ్వాదం ముగిసింది. తరువాత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి, బండ ప్రకాష్, నవీన్ కుమార్ రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎల్ రమణ, టి జీవన్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, దండి విఠల్, తాతా మధు, చల్లా వెంకట్రామ్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్ తమ పిటిషన్లను సభలో సమర్పించారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

### క్రిస్టియన్ సంఘాల డిమాండ్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మార్చి 27, ప్రభాతవార్త:** రాజమండ్రిలో ఇటీవల అనుమానస్పదస్థితిలో మృతి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ భౌతిక కాయాన్ని సికిందరాబాద్ సెంటనరీ బాప్టిస్ట్ చర్చిలో గురువారం సందర్శకుల కోసం ఉంచారు. సెంట నరీ బాప్టిస్ట్ చర్చికి చెందిన ఆంధ్రప్రదేశ్, తెలం గాణ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున పాస్టర్లు, క్రిస్టియ న్లు తరలివచ్చి సంతాపం వ్యక్తంచేశారు. ఈ సంద ర్భంగా పలు చర్చిల పాస్టర్లు, ఫాదర్లు మాట్లా డు తూ పాస్టర్ ప్రవీణ్ మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటన్నారు. అనుమా నస్పద స్థితిలో ప్రవీణ్ మృతిచెందడం క్రైస్తవ సమాజాన్ని తీవ్రంగా కలిచి వేసిందన్నారు. కొంతమంది మతో న్మాద శక్తులు ఆయనను హత్యచేసి రోడ్డు ప్రమా దంలో మృతి చెందినట్లు ప్రకటించారు. ప్రవీణ్ హత్యపై సమగ్ర విచారణ జరిపి నిందితులను అరెస్టు చేయాల న్నారు. దేశంలో శాంతిభద్రతలు దెబ్బ తినడంతో పాటు క్రైస్తవులకు రక్షణలేకుండా పోయిందన్నారు.



పాస్టర్ ప్రవీణ్ అంతిమయాత్రలో పాల్గొన్న క్రిస్టియన్లు, అభిమానులు

### పాస్టర్ ప్రవీణ్‌కు సంతాపం తెలిపిన పలు సంఘాలు

అనుమానస్పదస్థితిలో మృతి చెందిన పగడాల ప్రవీణ్ మరణవార్త తెలియగానే గురువారం సికిందరాబాద్ బాప్టిస్ట్ చర్చికి ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు పాస్టర్ కె.ఎ పాల్, బ్రదర్ అనీల్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం. రాజీవ్ సాగర్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు, ఉపాధ్య క్షుడు డేవిడ్ కడారి, కుల వివక్ష వ్యతి రేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, బాప్టిస్ట్ చర్చి అధ్య క్షుడు క్యాలిస్టర్, ప్రధాన కార్యదర్శి సోలమన్ లతోపాటు వేలాదిమంది క్రిస్టియన్లు తరలివచ్చి సంతాపం వ్యక్తం చేశారు.

### సెమిట్రీ స్మశాన వాటికలో అంత్యక్రియలు

పాస్టర్ ప్రవీణ్ అంత్యక్రియలు సికిందరాబాద్ పెరేడ్‌గ్రౌండ్ సమీపంలో ఉన్న సెయింట్ జాన్ స్ సెమిట్రీ స్మశాన వాటికలో జరిగాయి. సికింద రాబాద్ బాప్టిస్ట్ చర్చి నుంచి వైఎంసిఎ, క్లాక్‌టవర్ మీదుగా పెరేడ్‌గ్రౌండ్ సమీపంలోని సెయింట్ జాన్ స్ సెమిట్రీ స్మశానవాటిక వరకు భారీ అంతిమయాత్ర జరిపారు.

# ఇంటర్ తరువాత ఏం చదవాలి?

### నేడు టి-శాట్‌లో ప్రత్యేక లైవ్

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తరువాత ఏ కోర్సులను చదవాలని విద్యార్థులు ఆందోళన పడుతుంటారు. అటువంటి వారి కోసం టి-సాట్ ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ తరువాత ఏ కోర్సులను చదవాలనే అంశాలపై నేడు(శుక్రవారం) ప్రత్యేక లైవ్ షోను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన విషయాన్ని టి-శాట్ సిఇఒ వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేశాక విద్యార్థులు ఏ కోర్సు చదవాలనే సందిగ్ధం వీడేందుకు టి-శాట్ నెట్‌వర్క్ ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇంటర్ విద్య పూర్తి చేశాక ఏ కోర్స్ చదవాలి, సైన్స్, మ్యాథ్స్ లేదా ఏ ఇతర వృత్తి విద్య కోర్సులు ఎంచు కోవాలనే విషయమై అవగాహన కల్పించేందుకు తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో నిర్మాణ్, ఆస్మాన్ ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని సీఈవో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి టి-శాట్ నిపుణలో జరిగే ప్రత్యేక లైవ్ కార్యక్రమంలో ఇదే అంశంపై నిపుణులు ప్రత్యేక సలహాలు సూచనలు అందించనున్నారని వేణు ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 10 లక్షల మంది ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులు ఈ యేడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యారని, వారి భవిష్యత్‌ను నిర్ణయించే సరైన నిర్ణయాన్ని సూచించే విధంగా ప్రసార కార్యక్రమం ఉంటుందన్నారు. కార్య క్రమాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లదండ్రులు సద్వినియోగ పరుచుకోవాలని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి పత్రిక ప్రకటనలో కోరారు. లైవ్ ప్రసారాలు టి-సాట్ నెట్వర్క్ చానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యూబ్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. భారత రాజ్యాంగంపై ప్రత్యేక ప్రసారాలు భారత పౌరులు అత్యంత ప్రాధాన్యంగా భావించే భారత రాజ్యాంగంపై టి-సాట్ ప్రత్యేక ప్రసారాలు అందించనుంది. భారత రాజ్యాంగం రూపకల్పన, నిర్మాణం, ప్రాథమిక సూత్రాలు, కేంద్రరాష్ట్రాల మధ్య సంబంధాలు తదితర ప్రధాన అంశాలపై 30 నిమిషాల నిడివిగల సుమారు 15 ఏపిసోడ్స్ ప్రసారం కానున్నాయని తెలిపారు. ఈ నెల 29వ తేదీ శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి ఒంటి గంటన్నర వరకు నిపుణ, తిరిగి సాయం త్రం 6 గంటల నుండి ఆరున్నర గంటల వరకు విద్యలో ప్రసారమవుతాయన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించి సుమారు 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కొత్త సమాజానికి రాజ్యాంగం ప్రాధాన్యతలు తెలియజెప్పేందుకు టి-సాట్ ప్రయత్నిస్తోందని.. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువత తప్పనిసరిగా వినియోగించుకోవాలని వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు.

### సిఎం రేవంత్‌కు మంత్రి కొండా సురేఖ

# స్టీల్ టిఫిన్ బాక్స్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 27:** రాష్ట్రంలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని.. పర్యావరణాన్ని నష్టపరచొద్దని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్లాస్టిక్ వినియోగం ప్రమాద ఘంటికలు పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు సే నో టూ ప్లాస్టిక్ నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి స్టీల్ టిఫిన్ బాక్స్‌ను అందజేశారు. తెలంగాణ శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులకు జూట్ బ్యాగు, పుస్తకం, కాపర్ బాటిల్, స్టీల్ టిఫిన్ బాక్సు, బట్ట సంచులను మంత్రి కొండా సురేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతోపాటు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పిసిబి) మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి ఉన్నారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం 5 లక్షల కోట్లు కంటే ఎక్కువ ప్లాస్టిక్ సంచులు వాడి పారేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నిమిషం 10 లక్షలు వాటర్ బాటిళ్ల కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయిన మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలు 630 కోట్ల టన్నులు అని, వీటిలో 79 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రాలు, నీటి వనరులలో పారేస్తున్నారని పేర్కొన్నారు. మిగిలిన 12 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపై వదిలేస్తున్నారని, 9 శాతం మాత్రమే రీసైకిల్ చేయబడుతున్నాయని వివరించారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు.. మన కాల్వలు, సరస్సులు, నదీ ప్రవాహాలను అడ్డుకుంటున్నాయని, మొక్కలు, వృక్షాలు, జంతు జలాన్ని పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల కాన్సర్ కారక విషపూరిత వాయువులు వెలువడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైక్రో ప్లాస్టిక్‌లు జంతువులు, మానవ శరీరాల్లోకి చొరబడతాయని, అందు చేత ఎస్‌యుపి వద్దు.. సే నో టూ ఎస్‌యుపి నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ఎస్‌యుపి వినియోగం పూర్తిగా నివారించి బయో డిగ్రేడబుల్ వస్తువులను వాడాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు.నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు లాంటివి నివారించి జూట్, బట్ట సంచులను వాడాలని సూచించారు. జూట్ బ్యాగ్, బట్ట సంచులు, అలాగే ప్లాస్టిక్ బ్లాటిల్స్ వినియోగాన్ని నివారించి దానికి బదులుగా గ్లాస్ బాటిల్స్, స్టీల్ బాటిల్స్ ఉపయోగించాలని అన్నారు.



## విద్యార్థినికి బేడీలువేసి లాక్కెళ్లిన పోలీసులు

**వాషింగ్టన్, మార్చి 27:** రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలుచేపట్టిన డొనాల్డ్‌ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. సంచలన నిర్ణయాలు తీసుకుంటూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. వలసలు అరికట్టేందుకు కఠిన నిర్ణయాలు అమలుచేస్తున్నారు. యుఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న ఇతర దేశాలకు చెందినవారిని వీసా గడువు ముగిసినా తిరిగి వెళ్లకుండా ఉంటున్న అంతర్జాతీయ విద్యార్థులపై ఇమ్మిగ్రేషన్ అధికారులు కఠినంగా ఉన్నారు. వారిని అదుపులోకి తీసుకుని స్వదేశాలకు పంపిస్తున్నారు. ఇదేకోవలో మసా చుసెట్స్ లో అంతర్జాతీయ విద్యార్థినిని ఫెడరల్ అధికారులు అదుపులోకి తీసు కున్నారు. టఫ్ట్స్ యూనివర్సిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థినిని ఫెడరల్ అధికారులు అరెస్టుచేసి తీసుకెళ్లారని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

## నందిని పాల ధర రూ.4 పెంపు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** తెలంగాణతో పాటు, వివిధ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగే పాల ధరలను పెంచుతూ కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రివర్గ సమావేశం ఏకంగా లీటర్‌కు రూ.4 చొప్పున పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు కర్ణాటక పశుసంవర్ధక శాఖ మంత్రి కె. వెంకటేశ్ గురువారం వెల్లడించారు. పాల ఉత్పత్తి, ప్రాసెసింగ్ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు నందిని పాలు, పెరుగు విక్రయ ధరను లీటరుకు రూ.4 చొప్పున పెంచుతున్నట్లు చెప్పారు. పెరిగిన కొత్త ధరలు ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి అమల్లోకి రానున్నాయి. తాజా నిర్ణయంతో నందిని పాలు (నీలి ప్యాకెట్లో పాశ్చరైజ్డ్ టోన్డ్ పాలు) యొక్క ప్రాథమిక రకం ధర లీటరుకు రూ.42 నుండి రూ.46కు, పెరుగు ధరను లీటరుకు రూ.50 నుంచి రూ.54కు పెరగనుంది.

भारतीय मानक ब्यूरो
Bureau of Indian Standards
(The National Standards Body of India)
Organizing
QUALITY CONNECT CAMPAIGN 7.0
Connecting with Government Officials Across Telangana
16th March 2025 - 05th April 2025
What? : The Quality Connect Campaign by the Bureau of Indian Standards(BIS) is an initiative to raise awareness about Indian Standards among households, youth, and government official. It ensures that quality and safety remain an integral part of daily life.
Why? : BIS aims to educate public on the significance on the standardization in consumer safety, product quality, and national development.
Who? : Manak Mithras registered with BIS will reach all the government officials in this 7.0 campaign
Where? : Across the state of Telangana.
Contact Us: Bureau of Indian Standards, Hyderabad Branch Office
NFC-ZTS Road, HB Colony, Moulali, Secunderabad, Telangana - 500040
+91 91548 43230/31/32, bis@hybo.gov.in
Download BIS CARE APP
BIS celebrating 78
स्वच्छ भारत
एक कदम स्वच्छता की ओर
सत्यमेव जयते
मानकः पथप्रदर्शकः

వార్త

దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.

-హెచ్.లాంగ్‌ఫెలో

# చేటు తెస్తున్న అటవీ విధ్వంసం!

మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో ఊహించని విధంగా తలెత్తుతున్న మార్పులు, ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణశాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోయాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దరదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు కూడా పర్యావరణానికి చేటుతెలుస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిఎకరాల పంటపొలాలు జనావసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో ఏడెనిమిదేళ్లలో ఇండియా జనాభా నూటయాభై కోట్లకుపైగా చేరుకుంటుందని అందుకు అనుగుణంగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద హారించుకుపోతుందని స్పష్టం చేసింది. అడవులను విధ్వంసం నుండి కాపాడేందుకు దేశంలో ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ అటు కేంద్ర ప్రభుత్వంకానీ చేపడుతున్న చర్యలు సఫలీకృతం కావడం లేదు. వందలాది ఎకరాల అటవీ సంపద రోజూ అదృశ్యమైపోతున్నది. ఈ విషయం ఐక్యరాజ్యసమితి నివేదికల్లో కూడా స్పష్టంచేసింది. విచక్షణా రహితంగా అడవులను నరికివేయడంపట్ల న్యాయస్థానాలు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. తాజాగాపర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తుచేస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం కీలకమైన తీర్పు వెలువరించింది. చెట్లను నరికిన వ్యక్తికి చెట్టుకు లక్ష రూపాయల చొప్పున నాలుగు కోట్లయాభై లక్షల రూపాయలు జరిమానా విధించింది. పెద్దసంఖ్యలో చెట్లను నరికివేయడం,మనుషులను చంపడం కంటే దారుణమైందని జస్టిస్ అభయ్ ఎస్ఒకా, జస్టిస్ ఉజ్వల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనంవ్యాఖ్యానించింది. అంతేకాదు పర్యావరణం విషయంలో కనికరం చూపొద్దని కూడా ప్రభుత్వాలను దేశ అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. మధుర బృందావనంలోని దాల్మీయా ఫామ్స్‌లో ప్రైవేట్ భూమిలో ఒక వ్యక్తి నాలుగు వందల యాభై చెట్లను చట్టవిరుద్ధంగా నరికివేశారు.వాటిలో ముప్పైరెండు చెట్లు రక్షిత అటవీ భూమిలోని రోడ్డు పక్కనే ఉన్నాయి. దీంతో ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడంతో ఈ సంఘటనపై దర్యాప్తు చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సిఈసి) కొన్ని సిఫారసులు చేసింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆ వ్యక్తికి జరిమానా విధిస్తూ ఒక్కసారిగా అంతపెద్ద మొత్తంలో చెట్లను కూల్చివేయడం వల్ల కోల్పోయిన పచ్చదనాన్ని తిరిగి తీసుకురావడానికి అంతవృక్షజాలాన్ని పెంపొందించడానికి కనీసం వందేళ్లపైగా పడుతుందని వ్యాఖ్యానించింది. జరిమానా తగ్గించాలని నిందితుని అభ్యర్థనను కూడా సుప్రీం తిరస్కరించింది. న్యాయస్థానాల చర్యలతో అక్కడక్కడ ఈ అటవీ నరికివేత కొంతమేరకు తగ్గుతున్నా క్రమేపీ అటు స్మగ్లర్లు, ఇటు మరికొందరు దళారుల గొడ్డలివేటుకు అడవితల్లి గిలగిలలాడుతున్నది. ప్రభుత్వం కూడా బొగ్గ గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు,పరిశ్రమలు,నదీలోయలోని ప్రాజెక్టుల కోసం అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలెన్నో పర్యావరణానికి విఘాతం కలుగుతున్నాయి. మరొకపక్క కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమైపోతున్నాయి. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ఎంతటి హాని చేస్తున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారవర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళికణాలు తదితరవన్నీ వాయుకాలుష్యాన్ని పెంచుతున్నాయి.ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాటి నుంచో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రకృతి ప్రతిగా తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురియకపోవడం, కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురియడం, అకాల వర్షాలు, రాళ్ల వానలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. అంతేకాదు వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. యేటా దాదాపు మూడువందల ఎనభైకిపైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తుంటే లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఆస్తి నష్టాల గురించి చెప్పాల్సిన అవసరం లేదు. తుఫాన్‌లతో వ్యవసాయ రంగం కుదేలవుతున్నది. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో ప్రళయాలు తప్పవు. భారీమూల్యం చెల్లించాల్సి వస్తుంది.

ఘర్షణల వల్ల శక్తి వృధా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.



ఐ.జన్సాన్

జీవితంలో ఏదీ వ్యసనంగా పరిణమించకూడదు. అదే జీవితానికి ప్రధాన సూత్రం.



మార్షల్

# విలువలు పెంచే బడులు పెరగాలి

**విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా వారి ఆరోగ్య భద్రతల గురించి తగు జాగ్రత్తలను సూచిస్తూ వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు స్టూడెంట్ వెల్‌బీయింగ్ ప్రోగ్రామ్స్‌ను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కొత్త అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరుస్తుంది. విద్య అంటే బోలెడన్ని పుస్తకాలు చదవడం, బట్టీపట్టడం, పరీక్షలు రాయడంకాదు. విద్యఅంటే శీలనిర్మాణం.విద్య అంటేమానవులలో విలువలను పెంపొందించేది. మీరు అలాంటి విలువలను పెంపొందించుకుంటే అదేగొప్ప విద్య అని అంటారు గాంధీజీ. అయినప్పటికీ ప్రస్తుత కాలంలో మన సమాజంలో విలువలు లోపిస్తున్నవి అనేది అక్షరసత్యం. ఆ విలువలు పతనం కాకుండా వాటిని విద్యార్థి దశనుండి నిలబెట్టేందుకు తగు ప్రణాళికలను ఈ క్యాలెండర్‌లో పొందుపరచబడింది.**

వి.వి రమణ నాయక్

దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపొందుతుందనేదిసత్య వాక్కు అనేందుకు ఆశ్చర్యమేమీలేదు. శాస్త్ర సాంకేతికత ఆధారంగా ముందుకెళుతున్న నేటి ప్రపంచంలో విద్యయే ఆ దేశ సౌభాగ్యాన్ని, సంక్షేమాన్ని, భద్రతను నిర్ధారిస్తుంది. అందుకనే ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు వేసినా మళ్లీ పునర్నిర్మాణం చేసుకోగలం. దానికి ఉదాహరణయే నేటి జపాన్. ఏ దేశంలో అయితే విద్యా వ్యవస్థను నాశనం చేస్తామో ఆ దేశం శతాబ్దాల తరబడి అభివృద్ధి వైపు పయనించదనేది మేధావుల అభిప్రాయం. అందుకనే మన జాతి పునర్నిర్మాణము చెందాలంటే మన పాఠశాలలు, కళాశాలలో నుండి బయటకు వచ్చే విద్యార్థుల గుణాత్మకతపై ఆధారపడి ఉంటుంది. ఈ దశగానే మన ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం పాఠశాలస్థాయి నుండి గుణాత్మక విద్యను అందించడానికి ప్రస్తుతం విద్యావిధానాలలో అనేకరకాలమార్పులను చేసి పాఠశాల విద్య బలోపేతానికి కృషి చేస్తుంది. ఇందులో భాగంగానే నూతన విద్యా సంవత్సరానికి ఐదు రకాల బడుల విధానాన్ని తీసుకొచ్చే క్రమంలో అనేక రకాల సంస్కరణలకు పునాది వేయడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు ఆశించినంతగా లేదని జాతీయ సగటు కంటే మూడవ తరగతి విద్యార్థులు 5శాతం నుంచి 8శాతం వరకు వారి విద్యాలక్ష్యాల పరంగా తక్కువగా ఉన్నదని తెలియజేయటం జరుగుతుంది. పై తరగతులలో ఈ అంతరం మరింత ఎక్కువగా కనబడుతుంది. అసర్ 2024 నివేదిక సైతం రాష్ట్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి నైపుణ్యాలనేది విద్యార్థులలో క్షీణతయే కనబడుతుందని ప్రకటించింది. ఇలాంటి పరిస్థితులకు ధీటుగా పాఠశాలలను సమూలంగా మార్పులు చేసి విద్యా విధానాలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తం అవుతుంది ఆంధ్రరాష్ట్ర విద్యాశాఖ. విద్యాలక్ష్యాల సాధనలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు విద్యాశాఖ తీసుకొచ్చే నూతన సంస్కరణలలో భాగంగా 117 జీవోను అనుసరించి ఇప్పటివరకు జరిగిన మార్పులు సరైన ప్రతిఫలాన్ని ఇవ్వలేకపోతున్నదని భావించడం, కొన్ని వర్గాల నుండి వ్యతిరేక భావనలు రావడం వలన, ప్రస్తుతం దీనిని రద్దుచేసి మరింత సంస్కరణలవైపు విద్యాశాఖ అడుగులేయడం జరుగుతుంది. దీనిలో భాగంగానే ఐదు రకాల బడుల విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం కోసంప్రభుత్వం కృషి చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతుంది. సాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, బేసి ప్రైమరీ స్కూల్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్, ఉన్నత పాఠశాలలు వీటిలో ఉంటుంది. అందులో భాగంగానే విద్యార్థులకు గుణాత్మక విద్యను పెంపొందింప చేసే ఉద్దేశంతో మోడల్ ప్రైమరీ స్కూల్స్ విద్యా విధానాన్ని విద్యాశాఖ తీసుకురావడం జరిగింది. 45 నుండి 60 మంది విద్యార్థులున్న ప్రతి పాఠశాలను మోడల్ పాఠశాలలుగా గుర్తించటం జరుగుతుంది. అలాంటి పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయుల చొప్పున ఆ పాఠశాలలకు కేటాయించి ఒకటి నుండి ఐదవతరగతి వరకు ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క ఉపాధ్యాయుడును ఉంచి క్వాలిటీ ఎడ్యుకేషన్ ప్రతి విద్యార్థికి అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుంది. దీని వలన విద్యార్థులకు గుణాత్మక విద్య అందడమే కాకుండా ప్రస్తుత కాలానుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుంది. ప్రస్తుతం సుమారు 12వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. అక్కడ అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రతిరోజు ఆ ఉపాధ్యాయుడు 18రకాల సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది.60 మంది లోపు ఉన్న కొన్ని పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుఉండి ప్రతిరోజు 9రకాల సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి నెలకొన్న తరుణంలో అక్కడ క్వాలిటీ ఎడ్యుకేషన్ విద్యార్థులకు అందడం అనేది ఎండమావుల నుండి నీటిని ఆశించినట్లే అవుతుందనే అభిప్రాయం కలుగుతుంది. విద్యార్థుల వెనుకబాటుతనానికి ఇదొక ప్రధానకారణంగా భావిస్తుంది ప్రభుత్వం. కాబట్టి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి రాష్ట్ర విద్యాశాఖ మోడల్ స్కూల్ విధానాన్ని పేద విద్యార్థుల కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం సమాజానికి అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. దీనివలన ఒక్క



ఉపాధ్యాయుడే అన్నేసి రకాల సబ్జెక్టులను బోధించాల్సిన అవసరం లేకుండా తను ఏ సబ్జెక్టులో అయితే నిష్ణాతుడై ఉంటే ఆ సబ్జెక్టునే బోధించి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడానికి ప్రయత్నాలు చేయుటకు, ప్రభుత్వం తగు ప్రణాళికలు రూపొందిస్తుంది అని చెప్పేందుకు ఎటువంటి అతిశయోక్తి లేదు. కొన్ని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటున్న సందర్భాలలో సబ్జెక్టు టీచర్స్‌చే కాకుండా ప్రైమరీ టీచర్స్‌చే బోధన జరుగుతున్న విధానాన్ని గుర్తించిన విద్యాశాఖ, ఇలాంటి లోపాలను సరిదిద్దే ఉద్దేశంతో ఇక మీదట అటువంటి సందర్భాలలో ఆ విద్యార్థులకు ప్రైమరీ టీచర్స్‌చే కాకుండా, సబ్జెక్ట్ టీచర్స్‌చే బోధన అందించటానికి వారిని సమీపంలోని హై స్కూల్స్‌లో చేర్చేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుంది. ఇలా చేయడం వలన ఆ విద్యార్థులకుసబ్జెక్టు టీచర్లచే బోధన అందుతుంది. దీనితో వారికి క్వాలిటీ విద్య అందుతుందనే అభిప్రాయం కలుగుతుంది విద్యావేత్తలకు. ఈ విధానం కూడా పాఠశాల కమిటీ మెంబర్లైన వారి తల్లిదండ్రుల ఇష్టప్రకారంతోనే ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి ప్రణాళికలు రచించారు. విద్యా విధానాలలో తీసుకొస్తున్న మార్పులలో భాగంగా విద్యాశక్తి కార్యక్రమం ఒకటి. దీనివలన విద్యార్థులకు హైబ్రిడ్ లర్నింగ్ నిర్వహిస్తారు. అనగా వెనుకబడిన విద్యార్థులను ముందు ఉంచడానికి వీరికి ఆన్లైన్ ద్వారాకానీ, ఆఫ్లైన్ ద్వారా కానీ తరగతులు చెప్పించటానికి ఐఐటి మద్రాస్‌వారితో విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది.ప్రభుత్వ కాలేజీలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు సైతం ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లకుకోచింగ్ తరగతులను విద్యాశక్తిపేరుతో నిర్వహించటం జరుగుతుంది. ప్రస్తుతం కొన్నిచోట్ల పైలట్‌ప్రాజెక్టు కింద సుమారు 1800 మందికి ఉన్నత విద్య అవకాశాలకోసం కోచింగ్ ఇప్పించడం జరుగుతుంది. రాబోయే రోజులలో ప్రతి కళాశాలలో ఇది అందుబాటులోకి వస్తుందనే అభిప్రాయంకలుగుతుంది. గ్లోబలైజేషన్‌లో భాగంగా ఇంగ్లీష్ ప్రాముఖ్యతననుసరించి తప్పనిసరిగా విద్యార్థులకు ఇంగ్లీష్ భాష నైపుణ్యం అవసరమని గుర్తించిన విద్యాశాఖ, ఆంగ్లభాష కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేందుకు మిషన్ ఇంగ్లీష్ ఫ్లూయెన్సీ లాంటి కార్యక్రమాలను నిర్వహించుటకు సమాయత్తమవుతున్నది. ప్రస్తుత కాలంలో ఈ పేద ప్రభుత్వ విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్ అనేది ఎంతో అవసరమైనదని విద్యా విశ్లేషకులు అభిప్రాయపడుతున్న ఈతరుణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అనేది హర్షించదగ్గ విషయంగా అభివర్ణించవచ్చు. కాలాననుగుణంగా వచ్చేనూతన మార్పులను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులను సంసిద్ధం చేయడం విద్యాలక్ష్యాలలో ఒకటి. అందుకనే ప్రస్తుత కాలంలో ఏఐ యుగం ప్రవేశించిన పిదప దానిని అనుసరించి విద్యార్థి దశ నుండే డిజిటలీకరణకు అలవాటు చేయుటకు స్మార్ట్‌క్లాస్ రూమ్స్‌ను పెంచేందుకు విద్యాశాఖ కసరత్తుచేస్తుంది. అంతేకాకుండా డిజిటల్ అభ్యాసన సామర్థ్యాలను విద్యార్థులకు పెంపొందించేందుకు తగుప్రణాళికలను విద్యావిధాన మార్పులలో భాగంగా తయారు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నది. విద్య అనేది వ్యక్తి ఉపాధికి ఉపయోగపడా లనే ఉద్దేశంతో, విద్యార్థి దశ నుండే వారికి కెరీర్ గైడెన్స్‌ను అందించేందుకు విద్యాశాఖ పలురకాల ఉద్యోగ,ఉపాధి అవకాశాల సమాచార విధానాన్ని విద్యార్థుల ముందుకు తీసుకువస్తుంది. దీనిలో భాగంగా ఇంజినీరింగ్ చదువు, ఏపీపీఎస్సీ పరీక్షలవిధానం, వాటిలో ఉన్న ఉద్యోగరకాలు, యూపీఎస్సీ విధానం, బ్యాంకింగ్ మొదలైన ఉద్యోగాలు సాధించు విధానాలను విద్యార్థులకుతెలిపేందుకు వాటిని కెరీర్‌గైడెన్స్‌లోభాగంగా తరగతుల రూపంలో వివరించి వారిని లక్ష్యసాధనవైపు పంపేందుకు విధివిధానాలను విద్యాశాఖ రూపొందించుతున్నది. అంతేకాకుండా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా వారి ఆరోగ్య భద్రతల గురించి తగు జాగ్రత్తలను సూచిస్తూవారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు స్టూడెంట్ వెల్ బీయింగ్ ప్రోగ్రామ్స్‌ను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కొత్తఅకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరుస్తుంది. విద్యఅంటే బోలెడన్ని పుస్తకాలు చదవడం, బట్టి పట్టడం,పరీక్షలు రాయడం కాదు. విద్య అంటే శీలనిర్మాణం. విద్య అంటే మానవులలో విలువలను పెంపొందించేది. మీరుఅలాంటి విలువలను పెంపొందించుకుంటే అదేగొప్ప విద్యఅని అంటారు గాంధీజీ.అయినప్పటికీ ప్రస్తుత కాలంలో మన సమాజంలో విలువలు లోపిస్తున్నవి అనేది అక్షరసత్యం. ఆ విలువలు పతనం కాకుండా వాటిని విద్యార్థి దశ నుండి నిలబెట్టేందుకు తగు ప్రణాళికలను ఈ అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరచబడింది. •

# అంతర్జాతీయ బ్రాండ్‌గా అరకు కాఫీ!

అప్పన్న గొనప

అరకు లోయలో పుట్టి, ప్రపంచాన్ని అలరిస్తున్న అరకు కాఫీ ఇప్పుడు అంతర్జాతీయంగా ప్రఖ్యాతి పొందుతోంది. విశేషమైన సువాసన, అనుపమమైన రుచి, ఆరోగ్యానికి మేలు చేసే లక్షణాలతో ఈ కాఫీ ప్రపంచవ్యాప్తంగా కాఫీ ప్రియులను ఆకర్షిస్తోంది. తక్కువ ఆమ్లత, సహజమైన తియ్యతనంతో ప్రత్యేకమైన ఈ కాఫీ దేశీయంగా మాత్రమే కాకుండా, విదేశాల్లోనూ మంచి డిమాండ్‌ను సంపాదించుకుంది. అరకు కాఫీని ప్రత్యేకంగా నిలిపే ప్రధాన అంశం – దాని సేంద్రీయ సాగు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు రసాయన ఎరువులు లేకుండా సంప్రదాయ, సహజ విధానాలను అనుసరించి ఈ కాఫీని పెంచుతున్నారు. ఈ ప్రకృతి సిద్ధ కాఫీ గింజలు ఆరోగ్యానికి హితంగా ఉండటమే కాకుండా, మృదువైన రుచితో కాఫీ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు లోయ తన అందచందాలతో మాత్రమే కాకుండా, ఇప్పుడు కాఫీ ఉత్పత్తి ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. పూర్వం బ్రిటిష్ వారు ఈ ప్రాంతాన్ని కాఫీ సాగుకు ఉపయోగించినా, స్వాతంత్ర్యానంతరం ఈ మల్లిపొదల కొండలు కొంతకాలం మరుగున పడిపోయాయి. అయితే, గిరిజన రైతుల కృషి, ప్రభుత్వ మద్దతు, ప్రైవేట్ రంగ సహకారం ద్వారా ఈ కాఫీ తిరిగి చైతన్యం పొందింది. ఈ ప్రాంతంలో సేంద్రీయ విధానాలతో పండించే అరకు ఇప్పుడు భారతీయ వ్యవసాయ రంగంలో ఒక విప్లవంగా మారింది. గిరిజన రైతుల కృషి, ప్రకృతి సిద్ధంగా సాగుచేసే విధానాలు, పరిపక్వతకు ప్రత్యేక శ్రద్ధ ఇవన్నీ కలసి అరకు కాఫీని ప్రపంచంలోనే అత్యుత్తమ కాఫీల్లో ఒకటిగా నిలబెట్టాయి. ఇటీవల అరకు కాఫీ ప్రాముఖ్యతను మరింతగా చాటే విధంగా భారత పార్లమెంట్ ప్రాంగణంలో ప్రత్యేక అరకు కాఫీ స్టాల్ ప్రారంభించబడింది. ఇది దేశవ్యాప్తంగా అరకు కాఫీ గురించి అవగాహన పెంచడమే కాకుండా, గిరిజన రైతులకు కొత్త మార్కెట్ అవకాశాలను అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దూరదృష్టికి, ముఖ్యమంత్రి ప్రోత్సాహానికి నిదర్శనం. గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఈ ప్రత్యేక ఉత్పత్తిని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. ప్రస్తుతం అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. ప్రముఖ హోటళ్లు, స్పెషలిటీ కాఫీ షాపులు ఈ కాఫీని తమ మెనూలో చేర్చుకుంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని "అరకు గ్లోబల్ బ్రాండ్" గా మారేందుకు ప్రభుత్వం, ప్రైవేట్ కంపెనీలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. భారత ప్రభుత్వం, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, అరుకు కాఫీ రైతులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, గిరిజన రైతుల అభివృద్ధికి, అరకు కాఫీని ప్రపంచస్థాయిలో నిలబెట్టేందుకు ఎంతో దోహదపడుతున్నాయి. కాఫీ సాగు విస్తరణ, మార్కెటింగ్ సదుపాయాల కల్పన, ఎగుమతులను పెంచే విధంగా కొత్త ఆవిష్కరణలను అమలు చేస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా అరకు కాఫీ' అనే కాన్సెప్ట్‌ను ప్రోత్సహిస్తూ, దేశీయంగా,అంతర్జాతీయంగా అరకు కాఫీ ప్రాధాన్యతను మరింత పెంచేందుకు ప్రభుత్వ చొరవ అభినందనీయమైనది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాఫీ బ్రాండ్లతో పోటీపడే స్థాయికి అరకు కాఫీ ఎదిగింది. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత కాఫీ బ్రాండ్లతో పోటీ పడుతూ, తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడం గర్వించదగ్గ విషయం. భారత్ నుంచి వచ్చే అరకు కాఫీ, కేవలం వాణిజ్య ఉత్పత్తిగానే కాకుండా, "సాంస్కృతిక సంపద'గా మారింది. అరకు కాఫీ,భారతదేశ వ్యవసాయ రంగంలోనే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లోను ప్రత్యేక స్థానం సంపాదిస్తోంది. ఇది కేవలం ఒక కాఫీ మాత్రమే కాదు, భారతీయ కృషి, సంప్రదాయ వ్యవసాయ నైపుణ్యానికి సజీవ నిదర్శనం. భవిష్యత్తులో మరింత మందికి అరకు కాఫీ అందించేందుకు, ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ రంగం మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. •

# పర్యావరణ సమతుల్యత అవసరం

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్

పర్యావరణ పరిరక్షణకు, ఆర్థిక వృద్ధి రేటుకు మధ్య సంఘర్షణ మొదలైంది.భారత ప్రభుత్వం అభివృద్ధి ప్రయాణాన్ని ఒక నూతన నమూనాగా రూపొందించింది. పారిశ్రామిక విస్తరణ దేశాన్ని గ్లోబల్ ఎకానమీ వైపు తీసుకెళ్లినప్పటికీ, అది తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని కూడా తెచ్చిపెట్టింది. 1970ప్రాంతంలో చిప్కో ఉద్యమం పర్యావరణ పోరాటాలు ప్రకృతి పరిరక్షణ మాత్రమే కాకుండా సామాజిక న్యాయానికీ సంబంధించినవని స్పష్టంగా చూపించింది. ఆదివాసీలు, చిన్న రైతులు విధ్వంసకరమైన అభివృద్ధిని వ్యతిరేకించేవారుగా చరిత్రలో నిలిచారు.ప్రస్తుతం భారతదేశం తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఢిల్లీ వంటి నగరాల్లో పీఎం 2.5 స్థాయిలు భద్రతా పరిమితులను పదింతలు మించిపోయాయి. 2023 పర్యావరణ పనితీరు సూచిక (ఈ పీఐ) ప్రకారం, భారత్ 180 దేశాల్లో 168వ స్థానంలో ఉంది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీ పీసీబీ ) నివేదిక ప్రకారం,దేశంలోని 70శాతం నదులు మానవ వినియోగానికి అనర్హంగా మారాయి. గంగా, యమునా వంటి పవిత్ర నదుల్లో ప్లాస్టిక్, రసాయన కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. భూగర్భ జలాల దిగజారుతున్న తీరు మరింత ఆందోళన కలిగిస్తోంది. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో నీటి మట్టం ప్రతి సంవత్సరం ఒక మీటరుకు పైగా పడిపోతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. జీవవైవిధ్యం నష్టపోవడం ఈ సమస్యలను మరింత తీవ్రంగా మార్చుతోంది. "లాంటానా" వంటి దుష్ప్రభావిత మొక్కలు భారత అడవులను 40 శాతం ప్రాంతాన్ని ఆక్రమించాయి. అవి స్థానిక వృక్ష జాతులను , జీవుల ఆహార వనరులను ధ్వంసం చేస్తున్నాయి. పులుల జనాభా పెరిగినప్పటికీ, వాటి సహజ నివాసాల్లో 30 శాతం మానవ ముప్పునకు గురవుతున్నాయి. ఈ కారణంగా అడవుల్లో జంతువులు, స్థానికప్రజల మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయి. 2030నాటికి 500గిగావాట్ల నూతనీకరణీయ శక్తిని ఉత్పత్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం ఉన్నప్పటికీ, ఇప్పటికీ భారత్ 70 శాతం ఇంధన అవసరాల కోసం బొగ్గుపై ఆధారపడినట్లే ఉంది. పర్యావరణ వినాశన ప్రభావం సమాజంలో అసమానంగా పంచబడింది. ఈ నష్టాన్ని తీవ్రంగా ఎదుర్కొనేది పేద ప్రజలే. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదిక ప్రకారం, ఢిల్లీలో శ్వాసకోశ వ్యాధులలో



30 శాతం మంది బాధితులు మురికివాడల ప్రజలే. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, రసాయన కాలుష్యం వల్ల వ్యవసాయ భూముల ఉత్పత్తి సామర్థ్యం 40 శాతం తగ్గిపోయింది. ఈ కారణంగా చిన్న రైతులు మరింత దారిద్రంలోకి కూరుకుపోతున్నారు. అడవుల హక్కులను పరిరక్షించేందుకు 2006లో తెచ్చిన అడవి హక్కుల చట్టం (ఎఫ్ ఆర్ ఏ.) అమలులో విఫలమైందని ఆక్స్ఫామ్ సంస్థ పేర్కొంటోంది. దేశంలోని ఆదివాసీలలో 50 శాతం మంది ఇప్పటికీ తమ సాంప్రదాయ అడవి హక్కులను కోల్పోతున్నారు.ఈ సవాళ్లను ఎదుర్కొవాలంటే రాజకీయ, పారిశ్రామిక, సామాజిక స్థాయిల్లో దృఢమైన చర్యలు అవసరం. రాజకీయ నిర్లక్ష్యం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. 2020లో ప్రభుత్వం తీసుకువచ్చిన పర్యావరణ ప్రభావ అంచనా (ఈ ఎల్ ఏ) నిబంధనలు పారిశ్రామిక వర్గాలకు అనుకూలంగా మార్చబడ్డాయి. ప్రస్తుత బడ్జెట్‌లో పర్యావరణ పరిరక్షణకు కేవలం 0.1 శాతం మాత్రమే కేటాయించబడింది. బొగ్గు, సిమెంట్ పరిశ్రమల ముఠాలు స్థానిక ప్రజల హక్కులను అణగదొక్కుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గు తవ్వక ప్రాజెక్టుల విషయంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. మధ్య తరగతి ప్రజల నిర్లక్ష్యం కూడా సమస్యగా మారింది. 2022లో సెంటర్ ఫర్‌సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) నిర్వహించిన సర్వే ప్రకారం, భారత యువతలో 60 శాతం మంది పర్యావరణ ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు కొందరు ముందుకు వస్తున్నారు. "ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఇండియా" వంటి యువజన ఉద్యమాలు, ఐఐటీ/ఐఐఎం విద్యార్థులు పర్యావరణ చర్యలకు పునాదివేస్తున్నారు. సాంకేతిక పురోగతితో కొత్త పరిష్కారాలు లభిస్తున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ సంఘం (ఐపీసీసీ) హెచ్చరిక ప్రకారం, 2డిగ్రీల సెల్సియస్ పెరుగుతాయి. దీనివల్ల 4 కోట్ల మంది ప్రజలు వలస వెళ్ళే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, పర్యావరణ పరిరక్షణ కోసం కనీసం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) 2.5శాతం ఖర్చు చేయాలి. భారత భవిష్యత్తు పర్యావరణ, అభివృద్ధి మధ్య సమతుల్యతను ఎలా కాపాడుకుంటుందోనన్నది కీలకం. దీని కోసం నాలుగు ప్రధాన మార్గాలను అనుసరించాలి. మొదటగా, స్థానిక ప్రజల సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఆధునికశాస్త్రంతో అనుసంధానం చేయాలి. రెండవది, పర్యావరణ పరిరక్షణలో పేదల హక్కులను ముఖ్యంగా పరిగణించాలి. మూడవది, పాలనలో పర్యావరణ నిపుణుల పాత్రను పెంచాలి. చివరగా, యువతను పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనేలా చేయాలి. చిప్కో ఉద్యమం మనకు ఈ విషయాన్ని స్పష్టంగా నేర్పింది. మానవాళి ప్రకృతిపై అధిపత్యం కలిగి లేదని, మనం ఈ భూమికి అతిథులం మాత్రమేనన్న భావనతో ముందుకు సాగితేనే భారతదేశం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించగలదు. •

# ప్రజావాక్కు



## వికసిత్ భారత్‌కు అవినీతి అడ్డంకి

ఢిల్లీ హైకోర్టు జడ్జి అధికార నివాసంలో నోట్ల కట్టలు కనబడ్డాయని వార్తలొచ్చాయి. అవి సుమారుగా 50 కోట్లు ఉండవచ్చునేమోననే అంటున్నారు.కష్టపడి సంపాదించిన సొమ్మును ఎవరైనా బ్యాంకులో‌నో,బీరువాలోనో భద్రంగా దాచుకుంటారు గానీ ఇలావిచ్చలవిడిగా గదుల్లో పరచుకోరుకదా.మనకున్న అన్నిరంగాలు అవినీతిమయమైందనే వాస్తవం మరువరానిది. నమ్మకమున్న ఒకే ఒక వ్యవస్థ న్యాయస్థానం. అది కూడా చెడిపోతే ప్రజలకు దిక్కేది? వారిచ్చేతీర్పులు న్యాయసమ్మతమేనా అనే అనుమానాలు పొడచూపడంలో ఆశ్చర్యంలేదు.నేరారోపణ ఎదుర్కొంటున్న ఈ జడ్జిగారి పేరు యశ్వంత్ వర్మగారట. వీరిని అలహాబాద్ హైకోర్టుకు సుప్రీంకోర్టు కొలీజియం బదిలీ చేస్తే అక్కడి న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేసారు. ఈ జడ్జిగారిపై మోపబడిన అపవాదు అవినీతి ఆరోపణలు విచారణలో తేలాలి.గతంలో కూడా న్యాయ వ్యవస్థ మీద అవినీతి ఆరోపణలు లేకపోలేదు. ఓ పక్క వికసిత భారత్ దిశగా అడుగులు వేస్తూ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ప్రసిద్ధి చెందాలన్న ఆశలు లోతుగా వేళ్లూనుకుపోయిన అవినీతి అడ్డంకిగా మారుతుందేమోననే భయం, అనుమానం కలుగుతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలి

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీసమావేశాలగడువు ముగుస్తుంది.కావునా ప్రజా సమస్యల అంశాల చర్చకై మరింత సమయం పెంచాలి. ప్రజా ప్రయోజనాలకై అసెంబ్లీలో చర్చజరగాలి. రానున్న వేసవి కాలం కావునా ప్రధానంగా త్రాగునీరు, సాగునీరుపై చర్చించి నీటి సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలి. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## అనుమానం నివృత్తి చేయాలి

టిజిపియస్‌సి ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో తెలుగు మీడియం విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చినట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టి జి పి యస్‌సి స్పందించి విద్యార్థుల అనుమానంనివృత్తి అయ్యేలా ఒక స్పష్టమైన ప్రకటన జారీ చేయాలి.

- పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

## పెన్షన్ పెంచండి

పంతొమ్మిదివందల యాభైనాలుగు చట్టం పార్లమెంట్ సభ్యులకు జీతాలుపెన్షన్ పెంచుటకు రూపొందించబడినది సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేరాయితీలను పునరుద్ధించుటకుఇప్పటికే రైల్వే టికెట్లలలోఎక్కువ రాయితీలు కల్పిస్తున్నామనిపలు సందర్భాల్లో తెలియజేస్తున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు పెంచుటకు రకరకాల కమిటీలను వేసి వాటి నివేదికలను పరిశీలించి పెంచుట సాధ్యంకాదని తెలియజేస్తుంటారు.కనీసం కరువు భత్యం కూడా సమయానికి ఇవ్వడం లేదు. దాదాపు 1000 లోపల ఉండే పార్లమెంట్ సభ్యులకు మాత్రం ఐదు సంవత్సరాల కాలపరిమితిలో వారికి అనుకూలంగా నియమ నిబంధనలను చట్టాలనుతూ.చ తప్పకుండా అమలుచేస్తుంటారు. కానీ 1998 బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేయటంలో శ్రద్ధ చూపడం లేదు. ప్రతి మూడేళ్లకు ఒకసారి పెన్షన్ సమీక్ష చేసి పెంచుటకు నిర్ణయం తీసుకున్నా 27 సంవత్సరాలు కావస్తున్నఇంతవరకు ఒక్కసారికూడా పెన్షన్ పెంపుదల చేయలేదు.

-దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

మీ మొబైల్‌కి లక్షరూపాయలు లాటరీ తగిలింది. కొంత సొమ్ము ధరావత్తుకట్టండి.లక్ష మీఅకౌంట్‌కుజమచేస్తాం.ఒటిపి చెప్పండి. వెయ్యి కడితే గంటలో రెండువేలు ఇస్తాం. అలా ఐదు,ఆరు సార్లుమనల్ని నమ్మించి లాభాలు వచ్చేలా అకౌంట్‌కి జమ చేసి తర్వాత వారి వలలో మనల్నివేసుకొని లక్షకి లక్షా, కోటికి కోటి అని నమ్మబలుకుతారు. మనం దురాశతో కోట్లు ఇల్లు, వాకిలి అమ్మి వారి ఇనుపసాలే గూటిలో చిక్కుకుపోతాము. తర్వాత వారి నుంచి స్పందన శూన్యం. మిత్రుల సహాయంతో ఆన్‌లైన్ మోసపూరిత భూతాన్ని తరిమికొట్టండి.

-ఐనకోట రవికుమార్, నెల్లూరు

## కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించండి

కరీంనగర్ కార్పొరేషన్‌లోని ఆయా రోడ్లప్రాంతాల్లో ఉన్న ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని వాటి స్థానంలో మంచి పూలు,పండ్ల మొక్కలు నాటాలన్నారు. పచ్చదనంకోసం మొక్కలు నాటడం బాగుందని, కానీ కోనోకార్పస్ వల్ల శ్వాససంబంధిత వ్యాధులు వచ్చేప్రమాదం ఉందన్నారు. వీటిని ఆ ప్రాంతం నుండి వెంటనే తొలగించాలని మంగళవారం రోజున తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు వెంటనే చర్యలు తీసుకోగలరు.

-సింగు. లక్ష్మీనారాయణ,చింతకుంట, కొత్తపల్లి, కరీంనగర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సభాసంప్రదాయాలు అక్కరలేదా?

## స్పీకర్ తీరుపై ఇండియా కూటమి నేతల ధ్వజం

### ఓంబిర్లాకు వినతిపత్రం ఇచ్చిన వివిధ పార్టీల నేతలు



**న్యూఢిల్లీ,మార్చి 27:** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడంలేదని కాంగ్రెస్‌ఎంపిలు అందరూ కలిసి స్పీకర్‌కు ఫిర్యాదుచేసిన వెనువెంటనే ఇండియా కూటమి నాయకులు కూడా ఓంబిర్లాను కలిసి గురువారం ఒకవినతిపత్రం అందచేసారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ విధానాలను గౌరవించక పోవడంపై వీరంతా తమ వినతి పత్రంలో విమర్శించారు. కాంగ్రెస్ డిప్యూటీ నాయకుడు గౌరవ్ గగోయ్, సమాజ్‌వాదిపార్టీ ధర్మేంద్రయాదవ్, డిఎంకె ఎ రాజా, టిఎంసి కల్యాణ్ బెనర్జీ, ఎన్సీపీ సుప్రియా సులే తదితరులున్నారు. స్పీకర్‌ను కలిసిన తర్వాత గగోయ్ మీడియాతో మాట్లాడుతూ ఇండియా కూటమి నాయకులంతా కలిసి పార్లమెంటరీ విధానాలను ఉల్లంఘిస్తోందని విమర్శించారు.

వివిధ అంశాలనుప్రస్తావించిన బ్లాక్ నేతలు సభలో రాహుల్‌గాంధీ మాట్లాడే అవకాశం ఇవ్వక పోవడాన్ని కూడా ప్రస్తావించామని చెప్పారు. సభలో ఎప్పుడు ఎల్వోపీ లేచి నిలబడినా వారికి మాట్లాడే అవకాశం లభిస్తుందని, ఈ వ్యవస్థ షక్దర్ అండ్ కౌల్ పార్లమెంటరీ కార్యాచరణలో కూడా నమోదయిందని, అయితే ప్రస్తుతం ప్రభుత్వం పదేపదే ఎల్వోపీకి మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ఎన్నోసార్లు విజ్ఞప్తులుచేసినా అవకాశం కూడా ఇవ్వడంలేదని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. వివాదాస్పదమైన అంశాల్లో చర్చించేందుకు ప్రతిపక్షనేత స్వరం వినేందుకు స్పీకర్ సుముఖంగా లేరని వారు విమర్శించారు. ఇండియాకూటమి, ప్రభుత్వం మధ్య కీలక అంశంగా నడుస్తున్న ఈ వివాదంపై కూటమి పార్టీలన్నీ కూడా రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలిచాయి. స్పీకర్ అప్రజాస్వామిక పద్ధతిలో సభను కొనసాగిస్తున్నారని, ప్రతిపక్ష నేతను మాట్లాడనీయడంలేదని ఆరోపించిన సంగతి తెలిసిందే.

జీరో అవర్‌లో పార్లమెంటు విధివిధానాలకు కట్టుబడి ఉండాలని,సభ హుందా తనాన్ని పరిరక్షించాలని స్పీకర్ రాహుల్‌ను స్వల్పంగా మందలించిన సంగతి తెలిసిందే. ఈ సభలో తండ్రి కుమార్తె, తల్లికుమార్తె, భార్య భర్త అందరూ సభ్యులుగా ఉన్నారని, ఈక్రమంలో ప్రతిపక్షనేత రూల్ 349కి అనుగుణంగా నడుచుకోవాలని స్పీకర్ రాహుల్‌కు హితవు పలికారు. రాహుల్ మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగానే స్పీకర్ వెంటనే సభను వాయిదావేయడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. అలాగేసభలో విపక్ష సభ్యులు మాట్లాడుతున్న వేళ మైక్రోఫోన్‌లను స్విఛాఫ్‌చేయడాన్ని కూడా కూటమి నాయకులు స్పీకర్‌వద్దప్రస్తావించారు. వారి అభిప్రాయాలు, ఆందోళనలు ఆన్‌రికార్డు వ్యక్తంచేసే వీలులేకుండా మైక్రోఫోన్లు కట్‌చేస్తున్నారన్నారు. అదే మంత్రులు, అధికార ఎంపిలు మాట్లాడుతుంటే మాత్రం వారికి అన్ని అనుమతులు ఇస్తున్నారని, ఏకపక్షంగా సభను నిర్వహించడం సభాసాంప్రదాయం కాదంటూ ఆరోపించారు. గడచిన ఆరేళ్లుగా లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్‌ను నియమించకపోవడంపై స్పీకర్‌ను నిలదీసారు. 2019నుంచి డిప్యూటీ స్పీకర్‌పదవి ఖాళీగానే ఉందని, ఇది ఎంతమాత్రం సముచితం కాదని వారు గుర్తుచేసారు. సభ తటస్థ వైఖరితో కొనసాగేందుకు డిప్యూటీ స్పీకర్ పాత్ర ఎంతో కీలకం అవుతుందని ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నిక నిర్వహించడంలో విఫలం అయిందన్నారు.

అలాగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీలో తీసుకున్న నిర్ణయాలు కూడా అమలుకురాక పోవడంపైనా స్పీకర్‌వద్ద ప్రస్తావించారు. సభలోప్రధాని ప్రకటన అంశం ముందుగా బిఎసిలో చేర్చిన అంశంకాదని గుర్తుచేసారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఏకపక్షంగా సభా కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఎలాంటి ముందస్తు సంప్రదింపులు కానీ, సమాచారం కానీ ఉండటంలేదన్నారు. గతవారంలో జరిగిన సభలోప్రధాని ప్రకటన ఇందుకు నిదర్శనం అని గగోయ్ చెప్పారు.

వాయిదా తీర్మానాలను విస్మరిస్తున్నారని, తిరసనకరిస్తున్నారని, ప్రైవేటు సభ్యుల బిల్లులు తీర్మానాలను కూడా తిరస్కరిస్తుండటాన్ని సభా మర్యాదగా భావించలేమని ఇండియా కూటమి సభ్యులు చెప్పారు. వాయిదా తీర్మానం ప్రవేశపెట్టినపుడు స్పీకర్ ఎంపిల పేర్లు ప్రస్తావించి వారిని జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై మాట్లాడేందుకు జీరో అవర్‌లో అనుమతిస్తారని, అందుకువిరుద్ధంగా ఇపుడు పూర్తిగా తిరస్కరించారన్నారు. ప్రైవేటు బిల్లుల్లో కూడా చర్చకు అనుమతించడంలేదని తరాలుగా వస్తున్న సాంప్రదాయాన్ని ప్రస్తుత సభ విస్మరించిందని అన్నారు. బడ్జెట్, గ్రాంట్లడిమాండ్‌పై చర్చల్లో కీలక మంత్రిత్వశాఖలను కూడా నిలిపివేస్తోందని ఆరోపించారు. 193వ నిబంధన ప్రకారం అత్యవసర ప్రజాప్రాధాన్యం కలిగిన అంశాలను ఎలాంటి ఓటింగ్‌లేకుండా చర్చకు అనుమతించాల్సి ఉండగా అలా కూడా జరగడంలేదన్నారు.



## భారత్‌లో పర్యటనకు

# పుతిన్ అంగీకారం!

### రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడి

**మాస్కో, మార్చి 27:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. భారత్ పర్యటనకు రావాల్సిందిగా ప్రధాని నరేంద్రమోడీ చేసిన ఆహ్వానాన్ని తమ దేశాధినేత పుతిన్ అంగీకరించినట్లు రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. 'రష్యా అండ్ ఇండియా: టువార్డ్ ఏ బైలాటరల్ అజెండా' పేరుతో రష్యన్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కౌన్సిల్ (ఆర్ఐఎసి) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో లావ్రోవ్ మాట్లాడుతూ.. ఈ పర్యటన కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోడీ.. తొలి అంతర్జాతీయ పర్యటన రష్యాలో చేసిన విషయాన్ని లావ్రోవ్ గుర్తు చేశారు. ఇప్పుడు తమ వంతు వచ్చిందన్నారు. అయితే, పర్యటన తేదీలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

ఇదిలా ఉంటే, ప్రధాని మోడీ గతేడాది జూలైలో రష్యాలో పర్యటించారు. ఐదేళ్ల వ్యవధి తర్వాత అక్కడ పర్యటించడం అదే తొలిసారి. అంతకు ముందు 2019లో రష్యాలోని వ్లాదివోస్టోక్ నగరంలో నిర్వహించిన ఆర్థిక సదస్సులో మోడీ పాల్గొన్న సంగతి తెలిసిందే.

ఇటీవల రష్యా పర్యటన సందర్భంగా భారత్‌కు రావాలని పుతిన్‌ను మోడీ ఆహ్వానించారు. అమెరికా నుంచి టారిఫ్‌ల ముప్పు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపునకు సంప్రదింపులు జరుగుతోన్న సమయంలో పుతిన్ భారత్‌లో పర్యటించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



## ఎర్రసముద్రంలో మునిగిన జలాంతర్గామి

### ఆరుగురు మృతి, మరో తొమ్మిది మందికి గాయాలు!

**కైరో, మార్చి 27:** ఈజిప్టు తీర నగరమైన హుర్ఘడలో ఎర్ర సముద్రంలో పర్యాటకుల జలాంతర్గామి మునిగిపోయింది. ప్రమాద సమయంలో సబ్‌మెరైన్‌లో దాదాపు 40 మంది ఉండగా వీరిలో ఆరుగురు మృతి చెందినట్లు తెలిసింది. మరో తొమ్మిది మందికి గాయాలు కాగా వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నౌకాశ్రయం సమీపంలోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. హుర్ఘడ నగరం పర్యాటకానికి ఎంతో ప్రసిద్ధి. ఇక్కడి బీచ్‌లు, పగడపు దిబ్బలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. దీంతో పర్యాటక జలాంతర్గాములు ఇక్కడ సేవలందిస్తుంటాయి. ఇందులో సింద్‌బాద్ అనే టూరిస్ట్ సబ్‌మెరైన్ కూడా ఒకటి. సముద్రంలో 25 మీటర్ల లోతువరకు పర్యాటకులను అనుమతిస్తుంటారు. తాజా ప్రమాదంపై సదరు సంస్థ స్పందిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి జలాంతర్గాములు 14 మాత్రమే ఉన్నాయని, వాటిలో రెండు తమవేనని పేర్కొంది.

## పాక్ జైల్లో భారత్ మత్స్యకారుడి ఆత్మహత్య!

**ఇస్లామాబాద్, మార్చి 27:** కారాగారంలో మగ్గిపోతున్న భారత్‌కు చెందిన ఓ మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. జైలు సూపరింటెండెంట్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు సమాచారం. భారత్, పాకిస్తాన్ జలసరిహద్దులపై సరిగా అవగాహన లేకుండా చేపల వేటకు వెళ్లి అక్కడి అధికారులకు చిక్కినవారు ఎంతో మంది ఉన్నారు. అదేవిధంగా భారత్‌కు చెందిన మత్స్యకారుడు గౌరవ్‌రామ్ ఆనంద్‌ను (52) 2022లో అదుపులోకి తీసుకున్నారు.

అతడిని అరెస్టు చేసి కరాచీ జైల్లో ఉంచారు. నాటి నుంచి అతడు అక్కడి కారాగారంలోనే మగ్గిపోతున్నాడు. అయితే బాత్‌రూమ్‌లోకి వెళ్లిన మత్స్యకారుడు తాడుతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో అనుమానించిన జైలు అధికారి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే అతడు ప్రాణాలో కోల్పోయాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసేంతవరకు మృతదేహాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచనున్నట్లు పాక్ అధికారులు తెలిపారు.

కాగా గత నెలలో తమ కారాగారంలో ఉన్న 22మంది మత్స్యకారులను పాక్ ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారంనుంచి విడుదల చేసింది. మత్స్యకారులు సరిహద్దులను సరిగా గుర్తించకపోవడంతో ఇరువైపులా ఈ అరెస్టులు జరుగుతున్నాయి.

ఇదిలా ఉంటే జనవరి 1న ఇరుదేశాల ఖైదీల జాబితా మార్పిడి జరిగింది. పాకిస్థాన్‌లో 266 మంది భారత ఖైదీలున్నారు. భారత జైళ్లలో మొత్తం 462 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు మనదేశ జాబితా పేర్కొంది.

# మొబైల్‌ఫోన్లలోనే అగ్రనేతల దౌత్యం!



**పారిస్, మార్చి 27:** ప్రపంచనాయకులమధ్య మొబైల్‌ఫోన్లు కొత్త దౌత్యమార్గాలకు ద్వారాలు తెరుస్తున్నాయి. నేరుగా సంభాషణలకు ఆకస్మిక కాల్స్‌కు వేగంగా చర్చలు జరిపేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయని మేక్రాన్ సహాయకులు ఒకరు తెలిపారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు సుమారు ప్రతిరోజు ఒక్కసారైనా జెలెన్‌స్కీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సంభాషిస్తున్నట్లు చెప్పారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మొబైల్‌ఫోన్ దౌత్యంతో భౌగోళిక రాజకీయాలో సాంప్రదాయ రాయబారులపని తగ్గిపోయింది. ట్రంప్ శ్వేతసౌధంలో అడుగుపెట్టాక నేతలమధ్య మొబైల్‌ఫోన్ సంభాషణలు పెరిగిపోయాయి. టెలిఫోన్‌లో నాయకులు మాట్లాడాలంటే ముందు వారి సహాయకులు చాలాముందుగానే ఏర్పాట్లు చేసేవారు. ఇపుడు అవి తగ్గిపోయాయి. రోజుకు ఒకసారైనా ట్రంప్ తనతో మాట్లాడతారని ఇటీవలే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తెలిపారు. కొన్ని సందర్భాల్లో తాను మీటింగ్‌ల్లో ఉన్నా వాటిని త్వరగా ముగించి తనతో మాట్లాడాలని ఒత్తిడిచేస్తారని కూడా ఆయన చెప్పారు. వాస్తవానికి నాయకులు మొబైల్‌లలో మాట్లాడుకోవడం కొత్తేమీ కాదు. కానీ ట్రంప్ నేరుగా ఆవలి నేతతో మాట్లాడటానికి ష్టపడతారు. గతంలో బైడెన్ మాత్రం సాంప్రదాయ టెలిఫోన్ కాల్స్‌కే ప్రాధాన్యం ఇచ్చేవారు. యుద్ధం ప్రారంభ సమయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా వేగంగా నాయకులతో మాట్లాడేందుకు ఇదే విధానం వాడేవారు.

దేశాధినేతలు మొబైల్స్‌లో నేరుగా సంభాషించుకని ఆ వివరాలను సహాయకులకు చెప్పకపోతే చర్చల్లో వచ్చిన అంశాలు మరుగునపడిపోవడమే నిర్లక్ష్యానికి గురవడమో జరుగుతుందని దౌత్యరంగ నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నాళ్లక్రితం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మీడియా మీట్‌లో మాట్లాడుతుంటే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌నుంచి కాల్‌వచ్చింది. కొద్దిసేపు పక్కకువెళ్లిమాట్లాడి ఓపావుగంట తర్వాత చేస్తానని తిరిగి మీడియామీట్‌లో పాల్గొన్నారు. తాను రోజుకు ఒక్కసారైనా మేక్రాన్‌తో మాట్లాడతానని ఉక్రెయిన్ అధ్యక్షుడుజెలెన్‌స్కీ చెప్పారు. దీన్నిబట్టిచూస్తే అగ్రనేతలమధ్య మొబైల్ సంభాషణలతో దౌత్యబంధంమరింత పటిష్టం అవుతున్నదని నేరుగాసంభాషించేందుకు మరింతగా దోహదంచేస్తోందని దేశాధినేతలు పేర్కొంటున్నారు.

# 2వేల వీసా అపాయింట్‌మెంట్లు రద్దుచేసిన అమెరికా!



**న్యూఢిల్లీ, మార్చి 27:** భారత్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం రెండువేల వీసా అపాయింట్‌మెంట్లను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. మోసపూరిత కార్యకలాపాలతో సంబంధం ఉండటంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. అపాయింట్‌మెంట్ వ్యవస్థలో ఒక భారీ లోపాన్ని గుర్తించామని దౌత్యకార్యాలయం ప్రకటించింది. ఇవిమొత్తం బాట్స్‌ద్వారా వచ్చినట్లు గుర్తించామని వివరించింది. ఎక్స్ పోస్టులో దౌత్యకార్యాలయం ఇతర వివరాలను కూడా వెల్లడించింది. బాట్స్‌చేసిన 2వేల వీసా అపాయింట్‌మెంట్‌లు భారత్‌లో కాన్సులర్ బృందం రద్దుచేస్తోంది. మా షెడ్యూలింగ్ విధానాలు ప్రభావితంచేసే ఏజెంట్స్, ఫిక్సర్లను ఎంతమాత్రం సహించబోమని ఈ అపాయింట్‌మెంట్లను రద్దుచేయడంతోపాటు అనుబంధ ఖాతాలకు షెడ్యూలింగ్ అధికారాలను కూడా సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించింది. మోసాల నిర్మూలనకు మా ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయని వాటిని ఎంతమాత్రం అనుమతించబోమని అన్నారు. అమెరికా బిజినెస్, విజిటర్స్, బీ1, బీ2 స్టూడెంట్ వీసాలకు అపాయింట్‌మెంట్లకోసం సుదీర్ఘ సమయం వెయిటింగ్ ఉంటుందన్న విషయం తెలిసిందే. ఏజెంట్లకు డబ్బులు చెల్లిస్తేమాత్రం కేవలం నెలరోజుల్లోనే అపాయింట్‌మెంట్లు లభించడం పర్యాటకరంగంలో సర్వసాధారణం. ఇందుకోసం ఒక్కోవీసా దరఖాస్తుదారుడినుంచి 30 వేలనుంచి 35వేలవరకూ ఏజెంట్లు వసూలుచేస్తారు. తమ కుమారుడు అమెరికా యూనివర్సిటీలోచేరేందుకు సొంతంగా అపాయింట్‌మెంట్ ప్రయత్నిస్తే సాధ్యంకాలేదని, అదే ఏజెంట్‌కు 30వేలు చెల్లిస్తే వెంటనే వచ్చిందని ఒక వ్యక్తి చెప్పడం లోపాలను స్పష్టంచేస్తోంది. దరఖాస్తుదారుడు సొంతంగా అప్లికేషన్ పంపిస్తే సమీపకాలంలో అపాయింట్‌మెంట్ తేదీలు ఉండవు. కానీ ఏజెంట్లుకొన్ని రకాల ప్రత్యేకమైన బాట్స్‌ను వినియోగించి స్లాట్లను బ్లాక్‌చేస్తారు. 2023లో బీ1, బీ2 అపాయింట్‌మెంట్ల 999 రోజుల మార్పును చూపించింది. దీనితో భారతీయ దరఖాస్తుదారులకోసం ఫ్రాంక్‌ఫర్ట్, బ్యాంకాక్ ఇతరప్రదేశాల్లో అమెరికా అపాయింట్‌మెంట్లను తెరిచింది. మూడేళ్లక్రితంవరకూ వీసా వెయిటింగ్ సమయం చాలా ఎక్కువగా ఉందని భారత ప్రభుత్వం అమెరికా దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై సీరియస్‌చర్యలు తీసుకన్న అమెరికా ప్రభుత్వం గణనీయంగా వెయిటింగ్ పీరియడ్‌ను తగ్గించింది. ఇపుడు బాట్స్ వినియోగాన్ని అడ్డుకోవడంపై దృష్టిపెట్టింది.

# మనిషికి పంది కాలేయం.. చైనా డాక్టర్ల ఘనత!



**బీజింగ్, మార్చి 27:** వైద్య రంగంలో మరో అరుదైన ప్రయోగం. బ్రెయిన్ డెడ్ అయిన మనిషి శరీరంలో పంది కాలేయాన్ని అమర్చారు. ఈ మేరకు చైనా వైద్యులు ప్రకటించారు. భవిష్యత్తులో రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. మానవ శరీరంలోకి సరిపోయేలా జన్యు సవరణలు చేసిన ఓ పంది కాలేయాన్ని వైద్యులు సేకరించారు. బ్రెయిన్ డెడ్ అయిన మానవ శరీరంలోకి దాన్ని మార్పిడి చేశారు. గతంలోనూ అమెరికా వైద్యులు పంది మూత్రపిండాలు, గుండెను విజయవంతంగా అమర్చారు. అయితే.. ప్రపంచవ్యాప్తంగా కాలేయ దాతలకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. ఈ పరిణామాల దృష్ట్యా వైద్యులు మానవులకు ఈ సమస్య నుంచి ఉపశమనం కల్పించేందుకు పరిశోధనలు చేస్తున్నారు.

'జన్యు సవరణలు చేసిన పందుల అవయవాలను.. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించే అవకాశం ఉంటుంది. మళ్లీ మానవ కాలేయ దాత దొరికేంతవరకు ఆ రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉపయోగపడుతుంది. 10 రోజులపాటు ఆ వ్యక్తి వైద్యుల పర్యవేక్షణలో ఉంటారు. పంది కాలేయం పనితీరు.. మానవ శరీరం ప్రతిస్పందనను మా వైద్య బృందం పరిశీలిస్తుంది. ఇప్పటివరకు కాలేయం పనితీరు సక్రమంగా జరుగుతోంది' అని చైనాలోని జియాన్‌లో నాల్గో మిలిటరీ మెడికల్ యూనివర్సిటీ వైద్యులు తాజా ప్రకటనలో పేర్కొన్నారు. కాలేయ సంబంధ వ్యాధులతో బాధపడేవారికి ఈ ప్రయోగం ఎంతో మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఓ వ్యక్తికి అమెరికా వైద్యులు పంది గుండెను విజయవంతంగా అమర్చారు. సర్జరీ తర్వాత అతడు 40 రోజుల వరకు బాగానే ఉన్నాడు. తర్వాత ఆ గుండె వైఫల్యం చెందడంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా చైనా వైద్యులు చేసిన ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయనే అంశం ఆసక్తికరంగా మారింది.

## ఇయు, కెనడా చేతులు కలిపితే

# మరింత భారీగా సుంకాలు

### హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 27:** తమ దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడానికి ఐరోపా సమాఖ్య, కెనడా చేతులు కలిపితే మరింత భారీగా టారిఫ్‌లను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ప్రస్తుతం ప్రకటించిన మొత్తం కంటే చాలా ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అమెరికా దిగుమతి చేసుకొనే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకాన్ని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక ట్రంప్ నిర్ణయంపై ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ నిర్ణయం వ్యాపారాలకు ఏమాత్రం మంచిదికాదు.. వినియోగదారుల కోణంలో దారుణమైంది' అని విమర్శించారు. మరోవైపు కెనడా ప్రధాని మార్క్ కార్నీ కూడా ట్రంప్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. కెనడా కార్మికులపై ప్రత్యక్షదాడిగా పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రతీకరా చర్యలను తాము పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

మరోవైపు ఐరోపా సమాఖ్య తన ప్రతిఘటన నిర్ణయాలను ఏప్రిల్ మధ్య వరకు వాయిదా వేసింది. వీటిల్లో అమెరికా బర్బన్‌పై 50 శాతం సుంకాల విధింపు కూడా ఉంది. ఈ నిర్ణయం అమలుచేస్తే.. తాము ఐరోపా వైన్లు, ఆల్కహాల్‌పై 200 శాతం పన్ను విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆటోమొబైల్స్ దిగుమతులపై అదనపు సుంకాల నిర్ణయం అమల్లోకి రానుంది. దీంతో అమెరికాలోకి దిగుమతి అయ్యే కార్లు, తేలికపాటి ట్రక్కుల ధరలు పెరగనున్నాయి.

## ఉక్రెయిన్‌పై యుద్ధానికి మరో 3 వేల మంది ఉత్తరకొరియా సైనికులు

**క్యీవ్, మార్చి 27:** రష్యా తరపున ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి ఉత్తరకొరియానుంచి మరోమూడువేల మంది సైనికులను పంపించినట్లు దక్షిణకొరియా సైనిక విభాగం గురువారం వెల్లడించింది. ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ తమ దేశంలో పర్యటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రష్యా విదేశాంగశాఖ సహాయ మంత్రి ఆండ్రీ రూడెంకో తెలిపారు. ఇప్పటికే రష్యా తరపున పోరాడేందుకు 11 వేలమందిని కిమ్ ప్రభుత్వం పంపించింది. వీరిలో నాలుగువేల మందికిపైగా మరణించడమో గాయపడటమో జరిగిందని దక్షిణకొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ వెల్లడించారు. కేవలం సైన్యమే కాదు పెద్ద మొత్తంలో షార్ట్‌రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను కూడా రష్యాకు తరలించింది. దీనితోపాటు 220కిపైగా 170 ఎంఎం, 240 ఎంఎం శతఘ్నులను కూడా మాస్కోకు పంపించిందని ఆయన తెలిపారు. అదేసమయంలో రష్యా అత్యాధునిక స్పేస్, ఉపగ్రహ సాంకేతికతను ఉత్తరకొరియాతో పంచుకుంటున్నదని అమెరికా వర్గాలు ఇప్పటికే తెలిపాయి. ప్యాంగ్‌యాంగ్‌సేనలకు ఆయుధ వినియోగం శిక్షణ కూడా మాస్కో అందచేస్తోంది. ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్‌ఉన్ సమక్షంలో నేడు ఆత్మాహుతిడ్రోన్లను పరీక్షించారు. కృత్రిమ మేధతో ఇవి పనిచేస్తాయని పేర్కొన్నాయి. తమ సేనల డ్రోన్ల సామర్థ్యాన్ని కిమ్ తనిఖీచేసినట్లు వెల్లడించాయి. ఈ సందర్భంగా మానవ రహిత విమానాలు నిర్దేశిత లక్ష్యాలను ఛేదించాయి.

తమ దేశ అత్యాధునిక డ్రోన్లు శత్రువులపై నిఘా వేయడంతోపాటు భూమి సముద్రంపై దాడులు చేయగలవని కెసిఎన్ఎ సంస్థ ప్రకటించింది. ఇప్పటికే ఉత్తరకొరియా ఎయిర్‌బార్న్ ఎర్లీ వార్నింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను కూడా తయారు చేసింది. ఇది ఆదేశరక్షణ సామర్థ్యం గణనీయంగా పెంచింది. రష్యాకు చెందిన ఐఎల్ 76 విమానాన్నే ఎర్లీవార్నింగ్ వ్యవస్థ అమర్చేందుకు వాడినట్లు నిపుణులు చెపుతున్నారు.

## కన్నడ నటి రన్యారావు బెయిల్ పిటిషన్ నిరాకరణ

### ఈ కేసులో మరో వ్యక్తిని అరెస్టు చేసిన అధికారులు!

**బెంగళూరు, మార్చి 27:** బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు బెయిల్ పిటిషన్‌పై బెంగళూరులోని సెషన్స్ కోర్టు విచారణ చేపట్టింది. ఆమెకు బెయిల్ మంజూరుచేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ప్రస్తుతం తమ కస్టడీలో ఉన్న రన్యారావును అధికారులు విచారిస్తున్నారు. అయితేబెయిల్ కోసం ఆమె హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

రన్యారావు కేసులో మరో వ్యక్తిని అధికారులు తాజాగా అరెస్టు చేశారు. రన్యారావు కేసులో మరో వ్యక్తిని అధికారులు తాజాగా అరెస్టు చేశారు. సాహిల్ జైన్ అనే వ్యక్తి గోల్డ్ డీలర్‌గా వ్యవహరించాడు. నటి అక్రమంగా బంగారాన్ని రవాణా చేసేందుకు ఇతడు సహకరించాడు. అంతేకాకుండా గతంలోనూ రెండుసార్లు ఆమెకు సహాయం చేశాడని డిఆర్ఐ అధికారుల దర్యాప్తులోతేలింది. అందుకు సంబంధించిన ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా దుబాయ్ నుంచి అక్రమంగా 14కేజీలకు పైగా బంగారం తరలిస్తుండగా ఎయిర్‌పోర్టులో రన్యారావును అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరో నిందితుడు తరుణ్ రాజ్‌కు ఆమె ఆర్థిక సహాయం చేసినట్లు డిఆర్ఐ విచారణలో తేలింది. ఆమె పంపిన డబ్బుతోనే నిందితుడు దుబాయ్ నుంచి హైదరాబాద్ వెళ్లాడని కోర్టుకు



తెలిపారు. అంతేకాకుండా బ్యాంకాక్, జెనీవాలకు బంగారాన్ని అక్రమంగా రవాణా చేసేవారని పేర్కొంది. తరుణ్ రాజ్‌దుబాయ్ వెళ్లినరోజే తిరిగి వచ్చే వాడని ఆరోపించింది. తరుణ్‌రాజ్, రన్యారావు స్నేహితులని, వీరిద్దరూ2023లో దుబాయ్‌లో విరా డైమండ్స్ ట్రేడింగ్ ఎల్ఎల్‌సి అనే ట్రేడింగ్ కంపెనీని స్థాపించారని, నాటి నుంచి వ్యాపార భాగస్వాములుగా కొనసాగుతూ దీనిని నిర్వహిస్తున్నారని తెలిపింది. ఇప్పటివరకు ఈకేసులో ముగ్గురిని అధికారులు అరెస్టుచేశారు. తరుణ్ రాజ్‌ను ఎ2గా మరో వ్యాపారి అయిన సాహిల్ జైన్ ఏ3గా కస్టడీలోకి తీసుకున్నారు. బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ఆమె హవాలా మార్గాల ద్వారా నగదు బదిలీ చేసినట్లు రన్యా రావు అంగీకరించారని ఇటీవల న్యాయస్థానంలో డిఆర్ఐ తెలిపింది. ఈ క్రమంలోనే మరోసారి విచారణ జరిపిన న్యాయస్థానం ఆమె బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# కేంద్రం తెలంగాణకు చేసిందేమీ లేదు

## సెంటర్‌తో పోట్లాడేందుకు మేమే కూడా వస్తాం

### అసెంబ్లీలో మాజీమంత్రి కెటిఆర్


**హైదరాబాద్, మార్చి 27,ప్రభాతవార్త:** ప్రతిదానికి ప్రభుత్వం రాష్ట్రం అప్పులు పాలైందనడం సరికాదని కేటిఆర్ ఆన్నారు. రాష్ట్రం అప్పుల పాలైందనడానికి ఆధారాలు ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత 10 సంవత్సరాల్లో



ఏమీ చేయకుండానే రాష్ట్రంలో సంపద పెరిగిందాని నిలదీశారు.గురువారం ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కేటిఆర్ మాట్లా డుతూ..తెలంగాణ ఏర్పడినప్పుడు ఆదాయం రూ.3500 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.18 వేల కోట్లకు చేరిందన్నారు. అప్పులకు రెట్టింపు సంపదన పెరిగిందని తెలిపారు. అమెరికా లాంటి దేశాల్లో కూడా అప్పులు ఉంటాయని అప్పులు లేని దేశం కాని, రాష్ట్రం కాని ఉండవన్నారు. ఈ సభలో ఉన్నవారికి కూడా అప్పులు ఉన్నాయన్నారు. అప్పులు లేని వారు ఎవరైనా ఈ సభలో ఉన్నారాని ప్రశ్నించగా దానికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నాకు లేవు అన్నారు. అందుకే మీరు గ్రేట్ అని అన్న కేటిఆర్‌ళ రాష్ట్రానికి ఆర్ధిక మంత్రి కదా అలాగే ఉండాలనడంతో సభలో కొద్ది సేపు నవ్వులు విరిసాయి.మాకు పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చింది నిజమే. కానీ కేంద్రం బడ్జెట్లో తెలంగాణకు వచ్చింది గుండు సున్నానే. పురావస్తు శాఖ చరిత్రను తవ్వినట్లు.. గత ప్రభుత్వం, గత ప్రభుత్వము అని తవ్వుతూనే ఉందని కేటిఆర్ అన్నారు. దేశాన్ని సాకుతున్న రాష్ట్రాలలో తెలంగాణ టాప్ 5లో ఉందని ఆయన మరి కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే కేంద్రాన్ని ఒక్క మాట కూడా అనడం లేదని విమర్శించారు.తెలంగాణ అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడారు. ఖేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి వేగంగా జరిగింది. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అన్నీ రంగాల్లో అభివృద్ధిని సాధించింది. కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి రాష్ట్రం పేరు ఎక్కడా వినపడలేదు. అదికారంలోకి ఎవరు వచ్చినా రాష్ట్రాభివృద్ధి మాకు ముఖ్యం. తెలంగాణా పథకాలను కేంద్రం కాపీ కొట్టింది. రాష్ట్రానికి ఎన్నోసార్లు కేంద్రం అన్యాయమే చేసింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఏంటి? మాకు పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చింది నిజమే. కానీ కేంద్రం బడ్జెట్లో తెలంగాణకు వచ్చింది గుండు సున్నానే. 2014 నుంచి తెలంగాణపై కేంద్రం చూపిస్తున్న వివక్ష, రాష్ట్ర హక్కులను హరించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కొత్తబడ్జెట్ పన్ను శ్లాబులు

## ఏప్రిల్ 1 నుంచి అమలు



**న్యూఢిల్లీ, మార్చి 27:** బడ్జెట్‌లో పొందుపరిచిన కొత్త అంశాలన్నీ కూడా మరో రెండుమూడు రోజుల్లో అమలుకు రానున్నాయి. ఏప్రిల్ ఒకటవ ఏదీనుంచి క్రెడిట్‌కార్డు రివార్డులు, యుపిఐ సేవలు, ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పులు అమలులోకి వస్తాయి. ఐటికి సంబందించినంతవరకూ ఇటీవల బడ్జెట్‌లో 12 లక్షలరూపాయలవరకూ ఎలాంటి పన్నులేదని తేల్చారు. ప్రామాణిక తగ్గింపు కింద రూ.75 వేలు కలుపుకుంటే రూ.12.75 లక్షలవరకూ ఎలాంటిపన్ను చెల్లించనవసరంలేదని వేతన జీవులకు ఊరట ఇచ్చారు. రూ.25 వేలుగా ఉన్న రిబేట్‌ను ఇపుడు రూ.60 వేలకు పెంచారు. బ్యాంకు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు వార్షిక వడ్డీ 50 వేలు దాటితే టిడిఎస్ వసూలుచేస్తారు. ఇపుడు ఆమొత్తం వడ్డీ పరిమితి రూ.లక్షకు పెంచారు. అలాగే 60 ఏళ్లలోపు వారికి రూ.40 వేలనుంచి ఉన్నపరిమితి 50 వేలకు పెంచారు. ఇక సరళీకృత విదేశీ చెల్లింపులు కింద ఒక ఆర్థికసంవత్సరంలో ఏడు లక్షలు దాటితే టిడిఎస్‌కింద వసూలుచేస్తున్నారు. ఈ పరిమితిని ఇపుడు రూ.10 లక్షలకు పెంచారు. బ్యాంకులనుంచి విద్యారుణం తీసుకుని ఆ మొత్తం విద్యార్థి ఫీజుకోసం విదేశాలకు పంపిస్తే ఇకపై ఎలాంటి టిసిఎస్ ఉండదు. క్రెడిట్‌కార్డులపై రివార్డుల్లో ఎస్బీఐ కోతపెట్టింది. స్విగ్గీ, ఎయిరిండియా టికెట్ బుకింగ్‌లపై లభించే రివార్డులను కుదించింది. ఎస్బీఐ సింప్లీక్లిక్ క్రెడిట్‌కార్డు, ఎయిరిండియా ఎస్‌బిఐ ప్లాటినమ్ కార్డు, ఎయిరిండియాఎస్బీఐ సిగ్నేచర్‌కార్డు హోల్డర్లకు ఏప్రిల్‌నుంచి వచ్చే రివార్డుల్లో కోతపడుతుంది. యాక్సిస్‌బ్యాంకు విస్తారా క్రెడిట్‌కార్డులు ఏప్రిల్ 18 నుంచి సవరిస్తామని ప్రకటించింది. ఆ తర్వాతఎ వరైనా కార్డును రెన్యువల్‌చేస్తారో వారికి ఎలాంటి వార్షిక ఛార్జీలు ఉండవు. ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంక్ కూడా మార్చి 31 తర్వాత రెన్యువల్ అయ్యే విస్తారా కార్డులకు వార్షిక రుసుం తొలగిస్తుంది. అలాగే వాడుకలలోలేని, ఇతరులకు కేటాయించిన మొబైల్‌నంబర్లకు ఏప్రిల్ ఒకటినుంచి యుపిఐ సేవలు నిలిచిపోతాయి. బ్యాంకులు, పేమెంట్‌సేవల కంపెనీలకు ఎన్పీసీఐ ఆదేశాలు జారీచేసింది. యుపిఐలో లోడ్‌చేసిన మొత్తాలను మళ్లీ బ్యాంక్ ఖాతాలకు పంపించే సదుపాయి కూడా ఏప్రిల్‌నుంచి అందుబాటులోకి వస్తుంది. యుపిఐ లైట్ సేవలు వినియోగించుకోవాలంటే ఇకపై యాప్ పిన్; పాస్‌కోడ్, బయోమెట్రిక్ వంటివి ఉపయోగించాలి. యులిప్స్‌లో పెట్టుబడులు పెడుతుంటే ప్రీమియం మొత్తం రూ.2.5 లక్షలు దాటితే ఉపసంహారణ సమయంలో క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ చెల్లించాలి. 2025 బడ్జెట్‌లోనే ఈ మార్పులు వచ్చాయి. అలాగే పిల్లల భవిషనయత్తుకోసం దీర్ఘకాలిక పెట్టుబడి పెట్టాలనుకునేవారికోసం ఎన్పీఎస్ వాత్సల్య కింద కొత్త ఆర్థికసంవత్సరంనుంచి పన్ను మినహాయింపు ఉంటుంద.ఇ సెక్షన్ 80సిసిడి(1బి) కిందప న్నుప్రయోజనాలను కల్పించారు. అయితే ఇది పాత పన్ను చెల్లింపుదారులకు మాత్రమే వర్తిస్తుంది.

## శాసన మండలిలో

# 9 మంది ఎమ్మెల్సీలను సన్మానించిన సిఎం రేవంత్‌రెడ్డి

## 29తో 8 మంది.. మే 1తో

## ముగియనున్న ఒకరి పదవీకాలం

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో చివరి రోజున పదవి కాలం ముగియనున్న 9 మంది ఎమ్మెల్సీలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్,మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి,అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు సన్మానించారు. ఈ నెల 29తో 8 మంది ఎమ్మెల్సీల పదవి కాలం ముగియనుండగా.. మే 1న మరో సభ్యుడి పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో గురువారం చివరి రోజు సమావేశాల్లో పదవి కాలం ముగియనున్న సభ్యులకు తమ అనుభవాలను సభలో పంచుకోవడానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అవకాశం కల్పించారు. ఈ నెల 29తో బిఆర్ఎస్ సభ్యులు, మాజీ మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్‌తోపాటు ఎగ్గె మల్లేషం, శేరి సుభాష్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు.. కాంగ్రెస్ సభ్యుడు టి జీవన్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, కూర రఘోత్తమ్ రెడ్డి, ఎంఐఎం మండలి పక్ష నాయకుడు మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండి పదవి కాలం ముగయనుంది. మే 1న ఎంఎస్ ప్రభాకర్ రావు పదవి కాలం ముగియనుంది. దీంతో 9 మంది సభ్యులకు మండలి సభలో మాట్లాడే అవకాశం కల్పించారు. వీరిలో ఎంఎస్ ప్రభాకర్ రావు 15 సంవత్సరాలపాటు ఎమ్మెల్సీగా కొనసాగగా.. మాజీ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ 12 సంవత్సరాలు ఎమ్మెల్సీగా కొనసాగారు. అందులో 9 సంవత్సరాలపాటు మంత్రిగా కొనసాగారు. తమకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించిన పార్టీలకు, పార్టీల అధ్యక్షులకు కొందరు ఎమ్మెల్సీలు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలపగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా తమను ఎన్నుకున్న ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. శాసనమండలి సమావేశాలు ముగిసిన తరువాత సాయంత్రం 9 మంది ఎమ్మెల్సీలను ఘనంగా సన్మానించారు.

# కూలిపోయిన కాళేశ్వరానికి రూ.5వేల కోట్లుపైగా చెల్లించాం

## కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఏకసభ్య కమిషన్ నివేదిక

## ఫాంహౌజ్ ప్రాజెక్టులపై నిజనిర్ధారణ కమిటీకి సిద్ధం

## శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,మార్చి 27, ప్రభాతవార్త:** కూలిపోయిన కాళేశ్వరానికి కూడా రూ.5వేల కోట్లకు పైగా చెల్లించామని, గత ప్రభుత్వం చేసిన అప్పుల చెల్లింపులకే వచ్చే ఐదేళ్లలో రూ.6 లక్షల కోట్ల అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. 2014లో తెలంగాణ ఏర్పడిన రోజు రాష్ట్ర అప్పు రూ.72 వేల కోట్లని, కార్పోరేషన్ అప్పులు కూడా కలిపితే రూ.90 వేల కోట్ల అప్పని గుర్తు చేశారు. ఈ పదేళ్లలో ఎఫ్ఆర్‌బీఎం అప్పులే రూ.3.50 లక్షల కోట్లు దాటిందని, తమకు అధికారం అప్పగించేనాటికి ఉన్న అప్పు రూ.6.69 లక్షల కోట్లని తెలిపారు. పెండింగ్ బిల్లులే రూ.40వేల కోట్లు పెట్టిపోయారని వెల్లడించారు.శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు గురువారం సీఎం సమాధానం ఇచ్చారు.నోటిఫికేషన్లు వేయటం, కేసులు వేసిన నియామకాలు నిలిపివేయటం గత ప్రభుత్వం చేసిన పని అని, తమ ప్రభుత్వం 15 నెలల్లోనే 25 శాఖల్లో 57,946 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు. తాము కక్షపూరిత రాజకీయాలు చేయాలనుకుంటే కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. నక్సలైట్లు, దేశ ద్రోహులు ఉండే సెల్లో పార్లమెంట్ సభ్యుడినైన తనను వేశారని, చివరకు తనను పడుకోకుండా రాత్రిళ్లు లైట్లు వేశారని చెప్పారు. చర్లపల్లి జైలు నుంచి నా బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. నా బిడ్డ లగ్గానికి రాకుండా ఢిల్లీ నుంచి అడ్వకేట్లను తీసుకొచ్చారని పేర్కొన్నారు. చర్లపల్లి జైలు నుంచి ఫంక్షన్ హాల్‌కు వచ్చి మళ్ళీ జైలుకు పోయానని వెల్లడించారు. తన కుటుంబ సభ్యులను అసభ్యంగా తిట్టినా భరించానని. సొంతపార్టీ ఆఫీసులో బూతులు చెప్పించి వాటిని రికార్డు చేయించినా, చెంపలు వాయించే శక్తి ఉన్నా తాను సంయమనం పాటించానని తెలియచేశారు. కేటీఆర్, కేసీఆర్‌కు జైలులో డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కట్టించి ఇస్తానని అన్నానని గుర్తు చేశారు. కానీ అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్ష రాజకీయాలు చేసే వ్యక్తిని కాదని, కేటీఆర్, కేసీఆర్‌ను జైలులో వేయాలని చాలామంది మమ్మల్ని అడుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసిందని, తొలి విడత రుణమాఫీకి ఐదేళ్ల తీసుకున్నారని, రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదని సీఎం ఆరోపించారు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్ల రుణమాఫీ చేశారని, ఈవిధంగా చేసి జాప్యంతో వాటికి వడ్డీ రూ.8,500 కోట్లు పైగా అయ్యిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే రూ.26 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని రైతుబంధు కూడా వేయలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఎగవేసిన రైతుబంధు రూ.7,625 కోట్లు తాము చెల్లించామని అన్నారు. అలాగే వరి వేస్తే ఉరే అని స్వయంగా అప్పట్లో సీఎంగా ఉన్న కేసీఆర్ బెదిరించారని, తాము మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చామని గుర్తు చేశారు. రైతుల ఉచిత కరెంట్ కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయని పనులు మేం పది నెలల్లో చేశామని పేర్కొన్నారు. వడగళ్ల వానతో పంట నష్టం జరిగితే గత ప్రభుత్వం ఏనాడు పరిహారం చెల్లించలేదని ఆరోపించారు. ఇప్పుడు నీళ్ల నిలిపితే మొత్తానికే కూలుతుందని జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణులు చెప్తున్నారని తెలిపారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల వల్లే రాష్ట్రంలో వరి దిగుబడి పెరిగిందని కొనియాడారు. కాంగ్రెస్ ఘనతలను బీఆర్ఎస్ ఘనతగా చెప్పుకోవటం సిగ్గుచేటని వెల్లడించారు. గత ప్రభుత్వ హయంలో మల్లన్నసాగర్ కింద రైతులు ఆందోళన చేయలేదా అని ప్రశ్నించారు. 14 గ్రామాల ప్రజలను పోలీసులతో కొట్టించి బలవంతంగా భూసేకరణ చేశారని ఆరోపించారు. ప్రాజెక్టుల వద్ద ఎవరికి భూములు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? అని నిలదీశారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కాలువలు తీసింది నిరూపిస్తానని, ప్రాజెక్టుల కోసం పేదల భూములు తీసుకుని కేసీఆర్, వాళ్ల బంధువుల భూములు తప్పించారని ఆరోపించారు. పెద్దాయన కుర్చీ కోసం మీలో మీరే కొట్లాడవద్దని అన్నారు. పెద్దాయనను ఖతం చేసి ఆయన కుర్చీలో కూర్చుందామని చూడొద్దని, పెద్దాయనను నాలుగు కాలాలు బతకనీయండని తెలిపారు.

# 11 రోజులు, 97 గంటల పాటు కొనసాగిన సభ

## అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా

## సమావేశాలకు సహకరించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు: స్పీకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** ఈ నెల 12న ప్రారంభమైన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈసారి 11 రోజుల పాటు కొనసాగాయి. మొత్తం 97 గంటల పాటు సమావేశాలు జరిగాయి. 16 స్టార్డ్ కశ్నలకు మంత్రులు మౌఖికంగా సమాధానం ఇచ్చారు. 27 స్టార్ట్ కృశ్నలకు రాత పూర్వక సమాధానాలు ఇచ్చారు. 79 అన్‌స్టార్డ్ కృశ్నలకు సమాధానాలు ఇచ్చారు. 22 మంది సభ్యులు సప్లిమెంటరీ ప్రశ్నలు వేశారు. సభ్యులు 146 ప్రసంగించారు. మొత్తం మూడు తీర్మానాలను అసెంబ్లీ ఆమోదిం చింది. 12 బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా అమోదించారు. అసెంబ్లీ రికార్డుల ప్రకారం సభలో సభ్యులుగా ఇప్పటి వరకు కాంగ్రెస్ సభ్యులు 65 మంది, బిఆర్ఎస్ 38 మంది, బిజెపి 8 మంది, ఎంఐఎం 7 మంది, సిపిఐ ఒకరు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర మూడవ శాసనసభ 5వ సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన శాసనసభ సభ్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రతిపక్షాల సభ్యులకు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది, శాసనసభ అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చర్చలు అర్థవంతంగా జరిగాయని పేర్కొన్నారు. తమ నియోజకవర్గాలలోని సమస్యలను గౌరవ సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు.. సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిఫలించాయని సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

# భద్రాద్రిలో ఉద్రిక్తత.. హైవేను దిగ్బంధించిన ఆందోళనకారులు

## మృతుల పక్షాన ప్రజాసంఘాలు ఆందోళన

## ఇరువురి మృతితో భద్రాద్రిలో విషాధఛాయలు

**భద్రాచలం, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన భద్రాచలంలో భవనం కుప్ప కూలిన సంఘటన గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం భద్రాచలం స్థానిక సూపర్‌బజార్ సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం కుప్పకూలీ ఇరువురు సుతారి మేస్త్రీల మరణానికి కారణమైన సంఘటన



జాతీయ రహదారి వద్ద ఆందోళన చేస్తున్న ఆందోళనకారులు

విధితమే. ఇట్టి సంఘటనకు బాధ్యులైన గృహయజమానులు శ్రీపతి శ్రీనివాస్, శ్రీపతి శ్రీరామస్వాతిలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇట్టి అక్రమ నిర్మాణానికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీయం, బీఆర్ఎస్, ప్రజాసంఘాలు, నుంచి భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా మృతుల కుటుంబసభ్యులతో కలిసి భద్రాచలం చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతులకు రూ.50లక్షలు నగదు, కుటుంబలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కల్పించాలని డిమాండ్ చేశారు. ఇట్టి ఆందోళనతో జాతీయ రహదారిపై భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. ఒక పక్కన ఎండ తీవ్రతతోను, మరోపక్క ప్రజాసంఘాల ఆందోళనతోను, ప్రయాణికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇట్టి సంఘటన గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ ఆదేశానుసారం స్థానిక పోలీసులు ఆందోళన ప్రదేశానికి చేరుకుని బాధిత కుటుంబాలు, ప్రజాసంఘాలతో చర్చలు జరిపి, వారి యొక్క డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తామని, ఉన్నతాధికారులతో హామీ ఇప్పించిన బాధిత కుటుంబాలు శాంతించక పోవడంతో అక్కడి నుంచి ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

**కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సహాయకచర్యలు**

భవన నిర్మాణం కుప్పకూలిన సంఘటనలో ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ సహాయ కార్యక్రమాలు చేపట్టి కొనసాగిస్తూనే ఉన్నారు. సమీప ప్రజల నుంచి, బాధితుల కుటుంబసభ్యుల నుండి భవనం శిథిలాల కింద ఎంతమంది క్షతగాత్రులు ఉన్నారో సమాచారం సరిగ్గా లేకపోవడంతో శిథిలాల కింద పూర్తిస్థాయిల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. దీని కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను, సింగరేణి రిస్క్యూ టీం బృందాలను, అగ్నిమాపక శాఖతో పాటు పోలీసు శాఖ స్పెషల్ పార్టీ బలగాలు సుమారు 70మందితో శిథిలాలను తొలగిస్తూ సహాయక చర్యలు గురువారం రాత్రి 9 గంటల వరకు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ శిథిలాల కింద నుంచి బుధవారం అర్ధరాత్రి సుమారు 1.30 నిమిషాల సమయంలో చల్లా కామేశ్వరరావు (40) కొన ఊపిరితో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు బయటకు తీసుకురావడం జరిగింది. అప్పటికే కొన ఊపిరితో ఉన్న కామేశ్వరరావును హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. అయినా అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి మృతిచెందడం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. అదేవిధంగా కొనసాగుతున్న సహాయక చర్యల్లో మరొక సుతారీ మేస్త్రీ అయిన పడిశాల ఉపేందర్ శిథిలాల కింద మృతిచెందినట్లు అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. కానీ మృతదేహం రాత్రి 8.30 గంటలకు కూడా లభ్యం కాకపోవడంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నాసిరకం నిర్మాణాలు చేస్తూ అక్రమ భవన నిర్మాణం యజమానులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంతేకాకుండా అక్రమ భవన నిర్మాణాలకు సహకరించిన అధికారులపై కూడా జిల్లా అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# హైదరాబాద్ శివార్లలో హైడ్రా బుల్డోజర్లు

## ప్రజల ఫిర్యాదులపై అక్రమ నిర్మాణాల కూల్చివేత

## హైడ్రా ఇన్స్‌పెక్టర్‌తో బిఆర్ఎస్ నేత వాగ్వాదం

## ఆగని కూల్చివేతలు.. బాక్స్ క్రికెట్ గ్రౌండ్ నేలమట్టం

## కాలనీవాసుల హర్షం.. సిఎం, హైడ్రా కమిషనర్లకు పాలాభిషేకాలు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మార్చి 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో అక్రమ నిర్మాణాలు, రోడ్డు కబ్జాలపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిపై ఉక్కుపాదం మోపి కూల్చడానికి బుల్డోజర్లతో వచ్చిన హైడ్రా అధికారులతో స్థానిక భూయాజమాన్య కుటుంబానికి సంబంధించిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ మహిళా కార్పొరేటర్ భర్త వాగ్వివాదినికి దిగారు. తమ కాలనీకి లేఔట్‌లో సూచించిన రోడ్లను మూసి వేయడమే కాకుండా లేఔట్‌లో వదిలిన పార్కు స్థలాన్ని సైతం కబ్జా చేయడంతో కలుగుతున్న ఇబ్బందుల విషయాన్ని పేర్కొంటూ బోయపల్లి ఎన్‌క్లేవ్ వాసులు ఫిర్యాదు చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ తిరుమలేష్ తమ సిబ్బందితో గురువారం ఉదయం అల్మాస్‌గూడకు వచ్చారు. ఈ మేరకు జెసిబిలతో రోడ్లకు అడ్డంగా నిర్మించి ప్రహరీగోడలను, కబ్జా చేసిన స్థలంలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను జెసిబిలతో నేలమట్టం చేస్తుండగా భూయాజమాన్య కుటుంబానికి చెందిన బిఆర్ఎస్ నేత అయిన మాజీ కారొ ్పరేటర్ బోయపల్లి దీపిక భర్త బోయపల్లి శేఖర్‌రెడ్డి పలువురితో కలిసి అక్కడికి వచ్చారు. కూల్చివేతలపై మండిపడిన ఆయన హైడ్రా ఇన్స్‌పెక్టర్ తిరుమలేష్‌తో వాగ్వా దానికి దిగారు. ఈ నేపథ్యంలో ఘటనా స్థలంలో గొడవ జరగడంతో కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కూల్చి వేతలను ఎలాగైనా అడ్డుకోవాలని భీష్మించిన శేఖర్‌రెడ్డి జెసిబిలకు అడ్డుపడడంతో హైడ్రా సిబ్బందిని ఆయనను బలవంతంగా అక్కడి నుండి పక్కకు తప్పించారు. అనంతరం యధేచ్ఛగా హైడ్రా తమ కూల్చివేతలను కొనసాగించింది. ఇదిలా ఉండగా 1982వ సంవత్సరంలో అల్మాస్‌గూడ రెవెన్యూకు సంబంధించిన సర్వే నెంబర్లు 39, 40, 41, 42, 44లో ఉన్న మొత్తం 5.07 ఎకరాల భూమిలో లే ఔట్ చేసిన యజమానులు కాలనీకి మూడు రోడ్లను చూపించారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అదే విధంగా 236 గజాల స్థలాన్ని పార్కు స్థలం కింద వదిలారని పేర్కొన్న కాలనీవాసులు ప్రస్తుతం రోడ్లను అప్పటి భూయాజమాన్య కుటుంబానికి చెందిన వారు మూసి వేసి ప్రహరీగోడలు కట్టారనీ పార్కు స్థలాన్ని కూడా ఆక్రమించుకున్నారనీ అంతే కాకుండా బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను నిర్మించినట్లు కాలనీవాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తమ కాలనీకి రోడ్డు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్టా ్య సా ్థనిక బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను, మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి చివరకు హైడ్రా దృష్ ్టకి తేవడంతో హైడ్రా స ్పందించింది. ఈ మేరకు కూల్చివేతలు జరిపిన తర్వాత కాలనీవాసులు కృతజ్ఞతాపూర్వ కంగా సిఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రా కమీషనర్‌కు పాలాభి షేకం సైతం చేశారు. అయితే కూల్చివేతలను అడ్డుకోవడానికి ప్రయత్నించి తమ



హైడ్రా ఇన్స్‌పెక్టర్‌తో వాగ్వివాదం చేస్తున్న బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ భర్త బోయపల్లి శేఖర్‌రెడ్డి (నెట్ లోపల వ్యక్తి)

విధులకు ఆటంకం కలిగించిన శేఖర్‌రెడ్డితో పాటు మరి కొందరిపై ఫిర్యాదు చేస్తామని హైడ్రా ఇన్స్‌పెక్టర్ తిరుమలేష్ పేర్కొన్నారు. అయితే గురువారం సాయంత్రం వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ పోలీసు అధికారి తెలిపారు. మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు ఉప్పల్ క్రికెట్ సే ్టడియం బందోబస్తు నిమిత్తం వెళ్ళినట్లు సమాచారం. కాగా కూల్చివేతలపై అసహనం వ్యక్తం చేసిన బిఆర్ఎస్ నేత, భూయాజమాన్య కుటుంబానికి చెందిన బోయపల్లి శేఖర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని వెల్లడించారు.

# సహాయక చర్యలు మరింత ముమ్మరం

## టన్నెల్‌లోకి మరోసారి కడావర్ డాగ్స్

## ఎస్ఎల్‌బిసి ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 27, ప్రభాతవార్త:** ఎస్ ఎల్ బి సి, టన్నెల్ ప్రమాదం జరిగిన ప్రదేశంలో సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి ని నియమించగా గురువారం ఉదయం 10 గంటలకు సహాయబృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సలహాలు, సూచనలు, అందజేశారుఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ .... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు 34 రోజులుగా నిరంతరం సహాయక చర్యలో పాల్గొంటున్నట్లు, ప్రతిరోజు మూడు షిఫ్టులలో 600 మంది సిబ్బంది పాల్గొంటు సహాయక చర్యలు చేపడుతున్నట్లు, సహాయక బృందాల మధ్య పూర్తిస్థాయి సమన్వయంతో సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నట్లు తెలియజేశారు.టన్నెల్ ప్రమాదం జరిగిన రోజు నుంచి నిరంతరా యంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, సహాయక చర్యల్లో భాగంగా సొరంగంలో ఉన్నటువంటి మట్టిని టీబీఎం భాగాలను ఊట నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు, రెట్టింపు సహాయక బృందాల చే సహాయక చర్యలను చేపడుతున్నట్లు వివరించారు.టన్నెల్ లోపల సహాయక చర్యల ద్వారా వెలువడిన వ్యర్థ పదార్థాల ను ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు తెలిపారు.నిరంతరాయంగా వస్తున్న ఊట నీటిని అత్యధిక సామర్థం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. సహాయక చర్యలలో పాల్గొంటున్న సహాయక సిబ్బందికి కావలసిన ఆహారం,వసతి,ఆరోగ్యం తదితర సదుపాయాలను కల్పిస్తూ,వాటిపై నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్లు తెలిపారు.ప్రమాదం ప్రదేశం సమీపంలో టన్నెల్లో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు కేరళకు చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన కడవర్ డాగ్స్ ను గురువారం ఉదయం 11 గంటలకు ఎస్ఎల్‌బిసి సొరంగంలోనికి పంపినట్లు తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, మేజర్ డాక్టర్ విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య కడవర్ డాగ్ ప్రతినిధి బృందం పాల్గొన్నారు

**మనోజ్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా..**

నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ ప్రసాద్ కుమారుడు మనోజ్ కుమార్ మృతదేహాన్ని అతని స్వగ్రామానికి తరలించి, భార్య స్వర్ణలత కు అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మనోజ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియాను వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు గురువారం కలెక్టర్ తెలియజేశారు.

# సిటీ సివిల్‌కోర్టు అధ్యక్షుడుగా నవీన్ ఘనవిజయం

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్ష పదవికి పోటీ చేసిన సివి.నారాయణ రావుకు పశువుల నవీన్ ల మధ్యన హోరాహోరి పోటీలో సివి నారాయణరావు పై పసుల.నవీన్ 28 ఓట్ల ఆధిక్యతతో ఘనవిజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి త్రిలోక్ రాజు పై విజయం పొందారు. లేడీ రిప్రజెంటేటివ్ గా రేణుక గంగ తన సమీప ప్రత్యర్థి హరిప్రియ పై గెలుపొందారు. కార్యవర్గ సభ్యులుగా కె భానుచందర్, ప్రణతి లక్ష్మి, శేఖర్ యాదవ్, స్మామాట్ కెన్నట్ పాల్, సందీప్ సింగ్, శ్రీనివాస్ రెడ్డిలు అయినారు. ప్రధాన కార్యదర్శిగా బి అజయ్, సంయుక్త కార్యదర్శిగా ఎ రాజిరెడ్డి, కోశాధికారిగా వి నిర్మల, లైబ్రరియన్ గా రాకేష్ కుల్కర్ణి, క్రీడా మరియు సాంస్కృతిక కార్యదర్శిగా మహమ్మద్ ఆఫ్జల్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికైనారని ఎన్నికల అధికారి దీపక్ సంచేటీ ప్రకటించారు. మొత్తం 2158 ఓటర్లు ఉండగా 1073 ఓట్లు పోలైనానవి. చెల్లని ఓట్లు 33



పసుల నవీన్

# స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు గడువు

## మే 31 వరకు పొడిగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 27:** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు బోధన ఫీజులు, ఉపకార వేతనాల కోసం దరఖాస్తు గడువును మే 31 వరకు ఎస్సీ సంక్షేమ శాఖ పొడిగించింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.2024-25 విద్యా సంవత్సరానికి 11,88,120 మంది విద్యార్థులకు గాను 10,34,074 మంది దరఖాస్తు చేశారు.

# ఎసిబి వలలో విద్యుత్ ఎఇ

**హైదరాబాద్ (దుండిగల్), మార్చి 27, ప్రభాతవార్త:** వినియోగదారుడి నుండి లంచం తీసుకున్న విద్యుత్‌శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ)ను ఏసిబి అధికారులకు పట్టుకున్నారు. అధికారులు పేర్కొన్న వివరాల ప్రకారం..భౌరంపేట ప్రాంతానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి సూరారంలో ఇంటిని నిర్మించుకుంటున్నాడు. తన ఇంటి ముందు ఉన్న 11కెవి విద్యుత్ లైన్ తరలించడంతో పాటు తన ఇంటికి విద్యుత్ కేబుల్ వేయాల్సిందిగా ఏఈ సురేందర్‌రెడ్డిని ధరఖాస్తు ద్వారా ప్రసాద్ కోరాడు. అయితే ఏఈ పనులు చేయకుండా జాప్యం చేసుకుంటూ వస్తున్నాడు. దీంతో ప్రసాద్ తన పనులు త్వరగా చేయాలని అడగడంతో అయితే అందుకు లంచంగా రూ,30వేలు ఇవ్వాలని ఏఈ డిమాండ్ చేశాడు. తన వద్ద లేవని పలుమార్లు కోరిన స్పందించకపోవడతో బాధితుడు ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. గురువారం ఏఈ సురేందర్‌రెడ్డిని రహస్య ప్రదేశంలో కలిసిన ప్రసాద్ రూ,30వేలు అందజేశాడు. అనంతరం దొమ్మరపోచంపల్లిలోని కార్యాలయంకు చేరుకున్న ఏఈని ఏసిబి అధికారులు పట్టుకున్నారు.

## మహిళల ఛాలెంజ్ ట్రోఫీలో..
# జెమీమా టీమ్ 409 వద్ద డిక్లేర్



**న్యూఢిల్లీ:** జాతీయ సీనియర్ చాలెంజర్ ట్రోఫీలో స్నేహ్ రాణా సారథ్యంలోని గ్రూప్ డి 83 పరుగులతో వెనుకబడింది. జెమీమా రోడ్రిగ్స్ కెప్టెన్సీలోని టీమ్ సి 9 వికెట్ల నష్టానికి 409 పరుగులతో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఈ మ్యాచ్‌లో రెండో రోజుఆట ముగిసే సమయానికి టీమ్ డి జట్టు 99 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ధారా గుజ్జర్ ఎడాపెడా దుమ్మురేపింది. దీంతో (212 బంతుల్లో 103బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ శతకంతో ధారా చెలరేగిం ది. ఇక తెలంగాణ ఆల్‌రౌండర్ గొంగడి త్రిష ఎర్రబంతితో 3రోజుల పాటు త్రుటిలో సెంచరీని చేజార్చుకుంది. త్రిష (137 బంతుల్లో 93; 15 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. కెప్టెన్ స్నేహ్ రాణా (28; 3 ఫోర్లు), నందిని (32; 5 ఫోర్లు), అమన్‌జ్యోత్ కౌర్ (34 బంతుల్లో 39 బ్యాటింగ్; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. అంతకుముందు టీమ్ సి9 వికెట్లు కోల్పోయి 405 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్‌చేసింది. జట్టులోనిహాసబ్నిస్ సెంచరీ, అర్థసెంచరీతో ప్రత్యర్థి గ్రూప్ డి ప్లేయర్లలో రైళ్లు పరుగెత్తించింది. హాసబ్నిస్ (185 బంతుల్లో 169; 20 ఫోర్లు, 6సిక్సులు) చెలరేగగా, షఫాలీవర్మ (104 బంతుల్లో108; 19ఫోర్లు) సెంచ రీలతో కదంతొక్కారు. టీమ్ డిబౌలరల్లో త్రిష, కాశ్వీ గౌతమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం చేతిలో 5 వికెట్లు ఉన్న టీమ్‌డి ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 83 పరుగులు వెనుకబడి ఉంది. ధారా గుజ్జర్‌తో పాటు, అమన్‌జ్యోత్ కౌర్ క్రీజులో ఉంది.

## సెపక్‌తక్రా వరల్డ్ కప్ టోర్నీలో..
# చాంపియన్‌గా భారత్
### జపాన్‌ను ఓడించి స్వర్ణం కైవసం



**న్యూఢిల్లీ:** సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. బీహార్ రాజధాని పట్నా వేదికగా జరిగిన ప్రపంచ కప్ పురుషుల రెగూ ఈవెంట్‌లో భారత జట్టు స్వర్ణ పతకం సాధించింది. సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో భారత్ పురుషుల జట్టుకు ఇదే తొలి పసిడిపతకం కావడం విశేషం. కాగా, స్వదేశంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత్ ప్లేయర్లు మొత్తం 7 పతకాలు సాధించారు. పురుషుల రెగూ ఫైనల్లో భారత్ 11-15, 15-11, 17-14 తేడాతో జపాన్‌పై విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. తొలి సెట్లో ఓడి వెనుకబడిన భారత జట్టు, ఆ తర్వాత పుంజుకొని వరుసగా రెండు సెట్లు నెగ్గి విజేతగా నిలిచింది. ఈ క్రీడలో భారత జట్టు చక్కటి ప్రదర్శన కనబర్చింది. కేవలం స్వర్ణంతో సరిపెట్టు కోకుండా, ఈ ప్రపంచ కప్‌లో మరో 6 పతకాలు కూడా కైవసం చేసుకుంది. మహిళల డబుల్స్ విభాగంలో రజతం, పురుషుల డబుల్స్, మహిళల రెగూ, మిక్స్ క్వాడ్, మహిళల క్వాడ్, పురుషుల క్వాడ్ విభాగాల్లో కాంస్య పతకాలు నెగ్గింది. స్వదేశంలో జరిగిన సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో స్వర్ణం దక్కించుకుని భారత్ ప్రతిష్టను పెంచింది.




## మహిళల వన్డే వరల్డ్ కప్:
# 8 దేశాలు: 31 మ్యాచ్‌లు
### సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 26 వరకు

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్-2025 టోర్నీకి భారత్ నాలుగో సారి ఆతిథ్యమివ్వనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆధ్వర్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్వహించనున్న ఈ మహిళల వన్డే వరల్డ్ కప్ తేదీలు దాదాపు ఖరారయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ తేదీలను ఐసీసీ, బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఎనిమిది దేశాలకు చెందిన జట్ల మధ్య ఈ వన్డే వరల్డ్ కప్ జరగనుంది. మొత్తం 31 మ్యాచ్‌లు జరుగుతా యి. ఆతిథ్యదేశం భారత్‌తో పాటు, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షి ణాఫ్రికా, శ్రీలంక జట్లు ఇప్పటికే ఈ మెగా టోర్నీకి అర్హత సాధించాయి. ఏప్రిల్ 9 నుంచి 19 వరకు లాహోర్‌లో జరిగే క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా చివరి రెండు జట్లు ఖరారవుతాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో పాకిస్తాన్, వెస్టిండీస్, స్కాట్లాండ్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, థాయ్‌లాండ్ జట్లు పోటీపడనున్నాయి. ఒకవేళ పాకిస్తాన్ వరల్డ్ కప్‌కు అర్హత సాధించినట్లయితే ఈ మెగా టోర్నీని హైబ్రిడ్ మోడల్లో నిర్వహిస్తారు.

పాకిస్తాన్ జట్టు ఆడే మ్యాచ్‌ను శ్రీలంక లేదా యూఏఈలలో నిర్వహిస్తారు. ఇక ఈ ఏడాది భారత్ ఆతిథ్యమివ్వనున్న మహిళల వన్డే వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ వేదికల వివరాలు కూడా బహిర్గతమయ్యాయి. పంజాబ్ రాష్ట్రం, ముల్లాన్పూర్ లోని మహారాజా యాదవేంద్ర సింగ్ అంతర్జాతీయ స్టేడియం ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనున్నట్లు తెలుస్తోంది. 34 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం గల ఈ స్టేడియం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుకు రెండో హోంగ్రౌండ్‌గా ఉంది. ముల్లాన్‌పూర్‌తో పాటు, విశాఖపట్నం, తిరువనంతపురం, ఇండోర్, రాయ్‌పూర్లలో వరల్డ్ కప్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. ముల్లాన్పూర్, తిరువనంతపురం, రాయ్పూర్లలో ఇప్పటివరకు మహిళల అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగలేదు.

కాగా మహిళల వన్డే వరల్డ్ కప్ టోర్నీకి గతంలోనూ భారత్ ఆతిథ్యమిచ్చింది. గతంలో భారత్ 1978, 1997, 2013లలో ఈ మెగా టోర్నీని నిర్వహించింది. ఇప్పటి వరకు వన్డే వరల్డ్ కప్ 12 సార్లు జరగ్గా, భారత్ రెండు సార్లు (2005, 2017) రన్నరప్‌గా నిలిచింది.




# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మార్చి 27:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకున్నాయి. ఆటో దిగుమ తులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ పేర్కొనడంతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. ఆటో, ఫార్మా, టెలికమ్యూనికేషన్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు రాణించాయి. నిఫ్టీ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల్లోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్ నేపథ్యంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ మాతృ సంస్థ అయిన టాటా



మోటార్స్ షేర్లు 6 శాతం మేర కుంగాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు అమెరికా కీలకమైన మార్కెట్ కావడం ఇందుకు కారణం. సెన్సెక్స్ ఉదయం 77,087.39 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,082.51 77,747.46 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 317.93 పాయింట్ల లాభంతో 77,606.43 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 105.10 పాయింట్లు లాభపడి 23,591.95 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.79గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఎల్‌అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్‌షేర్లు లాభపడ్డాయి. టాటా మోటార్స్, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.61 డాలర్లు వద్ద కొనసాగగా, బంగారం ధరలు మళ్లీ పెరిగి ఔన్సు 3087 డాలర్లు వద్ద ట్రేడయింది.







Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.